శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలలకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౫.	ధాతృనామసంవత్సరము. మాఘఫాల్గునమాసములు.	సంచిక ౬.

విజ్ఞాపనము.

పాఠకమహాశయులారా !

ఈసంచికతోఁ బరిషత్పత్రికకు ౨౫ సంవత్సరములు పూర్తియగు చున్నవి. రజతోత్సవసమయము వచ్చినది. ఇది యంతయుఁ బాఠకుల యాశీర్వాదబలము. అభిమానులకు దురభిమానము మెండయినను, నభి లాషము తగ్గినను, రుచి సడలినను, స్నేహితులు (భాషావిషయమున) వైరులైనను, స్వభాషాభిమానులు పరభాషాదరులైనను, గ్రాంథికవా దులు గ్రామ్యవాదులైనను, సంస్కృతమిశ్రితము తెనుఁగు తల్లిభాష కా దని తాము సంస్కృతసమాసములను గుప్పించువారున్నను, నెవ్వ రేమైనను పెద్దలయాశీర్వాదమునను భాషాదేవి కరుణవలనను బరిషత్తును బత్రికయు నింతవఱ కవిచ్ఛిన్నముగా నడచుచున్నవి. స్థాపించిన మహనీయుల సత్య సంకల్పబలము—రజతోత్సవము గావింపనున్నది.

కాలానుసారముగా మార్పులు చేయవలయు ననువారు బైలువె డలిరి. కాలమే మార్పవలయును గాని తదనుసారముగ మానవుఁడా మా ర్చువాఁడు. మానవునిమార్పులు వెఱ్ఱితలలు వేయుటకే.

ఎవ్వ రెన్నివంకలు పెట్టినను, ఎవ్వ రెంతయాక్షేపించినను, సన్మార్గగాములను, వారుపెట్టుతొందరలను సహించి శాంతముగా హంసమువలె సన్మార్గమున నడచుచుఁ బరిషత్తు పలుకుచు "యోజించికొనుము, నిజము నిలుకడమీఁదఁ దెలియఁగలదు, వాగాడంబరముచాలు, ముగ్ధమాపిచ్చినమ్మకములు తగ" వని వాత్సల్యమునఁ జిఱునగవుతో లోకమునకు మౌనముగా సంజ్ఞలతోఁ దెల్పుచున్నది.

"శూరు న్నిర్దయుఁగా" నన్నట్లు వెఱ్ఱియాక్షేపణలకుఁ బ్రత్యుత్తర మీయకున్న నూరకున్న దని తలంచులోకమును బరిషత్తు దూరాలోచనము లేనిదానింగాఁ జింతించుచున్నది.

భాషాభిమానుల యాదరము తొల్లిటికంటె నింకముం దెక్కుడు కావలసియున్నది. రజతోత్సవోచితముగ నింతవఱకుఁ బరిషత్తు ప్రకటించిన గ్రంథములు నుపన్యాసములు విలసిల్లి యలంకారప్రాయములైనవి. సువర్ణోత్సవమునకుఁ దగునట్లు ముందుఁ బండితులుఁ, గవులు, విమర్శకులు సువర్ణశోభం గూర్చువ్యాసరాజములను దయచేసి ప్రసిద్ధులగుచు స్వభాషావిభవము నాంధ్రలోకమున వెల్లివిరియింపఁ బ్రార్థన.

పరిషత్తుప్రకటించిన యుత్తమ గ్రంథములను భాషాభిమానులాదరించి తాముచదివి మిత్రబృందముచేఁ జదివించి వానిలోని విశేషములను దిలకింతురుగాక.

అపూర్వతాళపత్రగ్రంథములను సేకరించిన వారు వానిని బరిషత్పుస్తకభాండాగారమునకు దయచేయుదు రని ప్రార్థన.

పత్త్రికాగ్రాహకులు తమతమచందా ధనమును బంపుచు మిత్రులను బ్రోత్సహించుచు యథారీతిఁ బరిషత్తు నాదరింతురుగాక.

కవిజనోజ్జీవని-సమస్యలు.

సమస్య లనఁగాఁ గవిని బరీక్షించుటకై పెద్ద లిచ్చెడు పద్యాది భాగములు. వీనిని గైపదము లందురు. కవికిఁ గలభాషాపాటవమును గనిపెట్టుటకై కవితయందలి యభ్యాసవిశేషములను దెలిసికొనుటకై యొసఁగెడు ప్రశ్నలు. సమస్యలు సంస్కృతమునందును గలవు. తద్ద్వారముననే మన తెనుఁగులోనికిని దిగినవి. సమస్య యిచ్చుట యనునది కవిని బరీక్షించుటలోని కఠినభాగము. చదివిన శాస్త్రాంశముల నడిగిన నిట్టె చెప్పవచ్చును గాని సమస్య లట్టివి కావు. అష్టావధానములో నిది యొకయంగముగా నున్నది. సమస్యలిచ్చుటలో ననేకవిధములు. సాధారణముగాఁ బద్యము నాల్గవచరణము నిచ్చి యొకటి మూఁడుచరణములును సందర్భానుసారముగాఁ బూరింపు మందురు. కడపటిచరణములో నక్షరగోపనమో యర్థవంచనమో-యుండును. కొంద ఱేదియో యొక వాక్యము నిచ్చి యిది యేవృత్తములో నిముడు నని యడుగుదురు. కొన్నిపదములనిచ్చి వీని నీవృత్తములో నిముడింపు మని యడుగుదురు.

నగరు, వగరు, తొగరు, తగరు ననుమాటల నిచ్చి భారతభాగవతరామాయణార్థముల నిచ్చునట్లుపద్యములు చెప్పుమని రాధామాధవకవి నడిగినారఁటగదా. స, సే, మి, రా. - అ, ప్ర, శి, ఖ. అను సంస్కృత ప్రశ్నలును సమస్యలలోనే చేరును.

గోలకొండ, మాలముండ, పూలదండ, కొత్తకుండ యని సమస్యయిచ్చినఁ బద్యములో నొకకవి యిమిడించెనఁట గదా : ఇట్టివే సమస్యలు. ఇందుఁ గొన్ని చాలఁ దేలికగాఁ గనఁబడును. పూరించుటకుఁ గూడఁ దేలికయే యగును. కొన్ని చిక్కులుపెట్టునవి కలవు. సమస్యలను బూరించుటకుఁ గవి కుభయభాషలలోనేకాను పరభాషలలోఁ గూడ ననుభవము కొన్నింటి కవసరమైనట్లు కనఁబడుచున్నది.

"తలకాయలపులుసుద్రావి తనిసిరి బాఁపల్"

"కప్పను గని పాము భీతి గడగడ వడఁకెఁ."

ఇట్టివి చాలఁ దేలికగా నుండును.

"ఏకాదశినాఁడు సప్త మేడేగడియల్."

దీనిపూరణమునకై కొంతయూహా యుక్తియు నవసరము.

"గుండ్రాతికిఁ గాళ్లు వచ్చి గునగున నడిచెఁ."

దీనిని బూరించుటయే ప్రధాన మైనది గాని-కోదండ్రాముఁడు, "ఇండ్రాప్రాసము" "ఈండ్ర" యాతఁడు సమస్య యిచ్చె ననుట యంత సరసముగాదు.

మొత్తముమీఁదఁ గవులను బరీక్షించుటకే సమస్యలు పుట్టిన వనుకొనవచ్చును. సమస్యాపూరణము వలన సాహిత్యబలము వృద్ధియగును. కొందఱకుఁ జదరంగపు వెఱ్ఱివలెనే సమస్యలవెఱ్ఱి యెక్కుడు. ఒక్కయష్టావధానిం గాంచిరా, యొక్కకవి తారసిల్లెనా, చాలఁజిక్కులసమస్య లిచ్చెదరు.

"ఇఁక నొకలక్షయిచ్చెదను నింకకుఁ బద్యము చెప్పు సత్కవీ" యని సమస్యయిచ్చిన- "ఇఁక నొకలక్ష యిచ్చినను నింకకుఁ బద్యము లేదు సత్ప్రభూ" అని చెప్పినట్లు విందుము.

"సంస్కృతవాసనామహిమ చాలకుగా భువి నెంచవానికిఁ" అని యెవ్వరో -మూఁడుగులసంస్థానములోఁ గాఁబోలు- సమస్య యిచ్చినట్లును అల్లమరాజు సుబ్రహ్మణ్యకవిగారు కాఁబోలును రెండుచరణములు పూరించినట్లును వినియుంటిని. విషయమును దెల్పుటకే కాని దీని యథార్థవిషయముగా నన్నింటిలోఁ నెంచుటకుఁ గాదు. అతివిస్తారము వలదు.

ఈసమస్యల పుస్తకమును తిరిచునాపల్లిజిల్లా, నవసాలపురమను పుదుకోట (క్రొత్తకోట) రాజైన రఘునాథభూపాలుఁడు రచియించెను. పుదుకోట స్వతంత్రసంస్థానము. ఈరాజవంశమునకు, తొండమాను లను

బిరుదనామము గలదు. ఈరఘునాథతొండమాన్ భూపాలుఁడు 1767వ సం. మొదలు 1789 వ సం. వఱకుఁ బరిపాలించెను. ఈతనియొద్దఁ బెద్ద విద్వాంసుఁడు నుదురుపాటి వేంకనార్యుఁడని యొకఁడు కలఁడు. ఈరాజు తండ్రి విజయరఘునాథతొండమాన్ మహీపాలునియొద్ద నీవిద్వాంసుని తండ్రి యుద్దండకవి బిరుదుగల సీతారామశాస్త్రి యుండెను. ఈవెంకన కవికుమారులు సాంబకవి మున్నగువారుండిరి. వీరందఱును ననేకగ్రంథములను రచించిరి. ఈసమస్యలను వెంకనకవి యిచ్చుచుండిన రఘునాథ భూపాలుఁడు పూరించినట్లు పుస్తకములోఁ దెల్పఁబడినది. ఈరాజు మున్ను పార్వతీపరిణయమను ప్రబంధమునుగూడ రచియించియున్నాఁడు. దానిలోఁ దన యాస్థానమునందలి విద్వాంసుఁడగు వెంకన్నకవిని బ్రశంసించి యున్నాఁడు. దానింబట్టి కొందఱు వెంకనకవియే రచియించి పార్వతీపరిణయమునకు రాజుపేరు పెట్టినాఁ డందురు. అట్లే దీనినిగూడ భావించెదరు. మనలో నున్నదిదే, కృష్ణదేవరాయలు నే నాముక్తమాల్యదను రచించితి నని యెన్నో సాక్ష్యములతోఁ దెల్పుచున్నను మనవారు దానిని బాటింపక పెద్దనార్యుఁడు రచించినాఁ డని చెప్పెదరు. ఇకఁ దక్కినవారి మాటెందుకు. కల్పనలలో, నంకునను నిస్సారకల్పనలలో, వానిని నమ్ముటలో మనవారందె వేసిన చేతులుగదా! సుప్రసిద్ధులు విద్వదగ్రణులు వేదము వేంకటరాయశాస్త్రులవంటివారు, ఆముక్తమాల్యదను శ్రీకృష్ణరాయలు రచించిన దని యొప్పుకొనక పెద్దనపేరు లోకులు చెప్పుచున్నను దానిం బాటింపక, చివరకుఁ బుస్తకముమీఁదఁ దమ పేరైన వేసికొన్నారు గాని రాయలపేరు గాని పెద్దనార్యునిపేరు గాని వేయఁ జేయాడినవారు కారైరి. ఇంక నితరుల లెక్కయేమి. మల్లినాథసూరి యెంత కొట్టుకొనుచున్నను బెద్దిభట్టుగారని మనవారు వాడుటమానరుగదా? పండితబృందము సభలో నుండఁగా రాజు రసికుఁడు కారాదా, కాఁడా? రాజు లంతయజ్ఞానులా! భోజరాజునాఁట రేమిచెప్పెదరో వీరు. ఇక విస్తరింపరాదు. పండితుఁడగు నుదురుపాటి వెంకన్నకవి కవిత్వమునకును ఈరాజుకవిత్వమునకు

ను భేదమున్నట్లు విమర్శకులుఁ బండితులునిదివఱకొప్పుకొన్నారు. ఏవి వెంకన్నవంటివాఁడుప్రయోగింపఁడని రఘునాథరాజునెత్తిని రుద్దినాఁడో యట్టివియే యీసమస్యలలోఁగూడఁగలవుగావున దీనిని వెంకన్నకవి కంటఁగట్టరనితలఁచెదను. ఆర్యులారా! నానుడులను నమ్మక నానుడులను విశ్వసింపుఁడు. ఇటీవలి మృత్యుంజయ కవివంటివారు ధనాశచేఁ బలువురపేర బహుగ్రంథములు రచించినట్లు కనఁబడుచున్నదిగాని- ఆంధ్రభాషార్ణవమువంటి శ్రేష్ఠతరాంధ్రనిఘంటువును రచియించి యాంధ్రులకు భిక్షపెట్టినవిద్వాంసుఁడు డబ్బుకక్కుఱితిని హీనకార్యమును జేయఁడు. భోజమహారాజు మొదలిప్పటి చిన్నచిన్న ప్రభువులవఱకును వారివారిగ్రామస్థానములలో ననేకులు కవులుఁ బండితులు నిల్చియున్నారు. అరసికులయినరాజులు కవుల నాదరింతురా.

ఏవయిన దోషపదములు (వరించేవేళ, దివ్యరత్నాకలితంబగుఁ దృశ్యతివిధంబున) కలిగిన నవి యప్పటికిగ్రామ్యకత్యలోఁ జేర్పనివారుకొందఱుండియుందురని తలంచుట లెస్స. కవులు సమ్మతించి రనవచ్చును. అంతియకాని రాజులుచెప్పినవి తప్పులు వారికవులుచెప్పినవి యొప్పులు ననుట సమంజసముగాదు. ఏవియోకొన్ని పదములు విరుద్ధములు దొరలినను- వానిని రాజు కవికిఁ జూపించిన సమర్థించి సందర్భశుద్ధిగా నున్నదనో దిద్దిన నచ్చుట సరిగాఁ గుదురదనియో ప్రభువును దప్పులు పట్టుటకు శంకించియో యట్టివానిని సమ్మతించినంతన యేమాయె. మఱియు నొక్కరు రచించిన తప్పుల పుస్తకమును విద్వాంసుఁడు దిద్దిన నది యతనిశైలికే వచ్చును. భేద మెట్లు తెలియును. ఇప్పుడిట్టివెన్ని వెలువడుటలేదు! శాంతము పాపము!

ఈకవిజనోజ్జీవని పరిషత్పుస్తకభాండాగారములో 3852వ సంఖ్యను గలదు. ఈకాగితముపుస్తకము పరిషత్తునకుదక్షిణదేశమునఁ బుస్తకసంపాదన మొనర్చిన బ్ర. హరి సేతురామయ్యగారు సంపాదించినది. ఇది వారి స్వహస్తలిఖితము. ఈయన వెంకనకవిగారి బంధుకుటుంబములోనివారు.

తిరిచునావల్లిలో నున్నారు. ఇందలివివరణములలోని కొన్నిమాట
మేము సవరణ చేసితిమి. కొన్ని యిప్పటివారికి రుచింప వని తొలఁగించితిమి
౧౦౮ పద్యములకు ౭౫ మాత్రమే ప్రకటించితిమి. తొలఁగింపఁ బడిన
యభిలాషగలవారు మూలగ్రంథములోఁ జూడవచ్చును.

లికుచంబులు కొండలంత లేదా వాడా.
రాళ్లు తినుదాన గూసెకు రాజవదన.
మగవానికి వైరి యూఁడువాఁడే తలఁచఁగ.
ధారుణి పాడవయ్యె గిరులు తలక్రిందయ్యెఁగ.
అగ్నికిఁ గాళ్ల యిరుగాళ యధికముగలదే.

ఇట్టివి పూరణములోఁ జమత్కృతి లేనివి, యసభ్యముగా నుం
నేమో యనుకొన్నవి తొలఁగింపఁ బడినవి. "పగటఁ జంద్రిక" యన
48వ సమస్యకు రెండుపద్యములున్నవి. మొకటిపద్యముందొలఁగించితి
ఇప్పటికిని గొన్నిపూరణములు శ్లేషలమూలమునఁ జక్కగాఁ గుదురు
లేవు. వంకాయ, వంకాయె, బీర(అ)కాయ-జాబీరకాయ యను నిట్ట
చూడుఁడు.

ఇది నిజముగాఁ గవిజనోజ్జీవనియే. 73వ పద్యము శ్లాప్రాసయు
ము.75వది-గోగ్రణి గో అగ్రణీ గవాగ్రణి.-ఇట్టివి పండితుఁడు కానివాఁడుపూ
రించినవి కావు. పాండిత్యము లేనివాఁడు పార్వతీపరిణయమును రచిం
గలఁడా. అందెంత లోకానుభవవిషయమున్నదో చిత్తగింపరా! అక్షరగ
ణన వృత్తగోపన సమస్యలు, సాధారణములా. అవి సాధారణులకు సాధ
ములా! మాపరాకుననే కావచ్చును-గ్రంథముచివర కాగితములో న్రా
ప్రక్కను "౨౮ (a) నాలుగేళ్లకు నెనిమిదే నలినవయన-

తే. గీ. పడునొక్కటికిని నాలుగెద్దులుండ
నిరుడు కొలుచుండె గాదెలఁ దఱచుగాను
అల్లయెద్దులలో నగ మమ్మివేయ
నాలుగేళ్లను నెనిమిదే నలినవయన."

అనుశ్లోకపద్యముగలదు. మొదట విడువఁబడినది. మూలములోఁ జేరలేదు. అర్హమేని జేర్చుకొనుఁడు. అంగడులలో దొరకుసమస్యల పుస్తకముకంటె నిందనేకవిధముల విశేషములతోఁ గూడిన పద్యములుగలవు. చదువరులకు నేను దెలుపనక్కఱయుండదు.

కవనమునం దాదరముగలపాఠకులార ! సమస్యలనాదరింపుఁడు; సమస్యాపూరణమునందును సమస్యల నిచ్చుటయందును నిపుణుల రగుఁడు. పెక్కులు సమస్యలం జదివినఁగాని మీకు దానియం దుత్సాహము కలుగదు, కలిగినంగాని చమత్కారముగ సమస్యల నీయఁజాలరు, పూరింపఁజాలరు. సమస్యాదరణము-భాషాభివృద్ధికి మూలమగును.

పుదుకోట, దానిప్రభువులను, ఆ రివిద్వాంసులను, వారివారి గ్రంథములం దెలుపుచు విరివిగాఁ బరిషత్తువారు చక్కని చరిత్రము వ్రాయింపనున్నారు. కావున నీచిన్నిపొత్తము పీఠికలో విశేషింపలేను.

విద్వద్విధేయుఁడు,
క్రొత్తపల్లి సూర్యారావు.

సాహిత్యసంస్కారము.

— కాశీభట్ట కృష్ణరాయశాస్త్రిగారు, సాలూరు —

మనము కావ్యవిషయ మరయుదమన్న ఖండకావ్యములు కావున నామూలాగ్రమరయ నక్కఱలేదు. ఒకటిరెండు విషయములే చాలును. ఈఖండకావ్యములును నల్పాల్పఖండకావ్యములు కాని మేఘదూతాదుల వంటివి కావు. చాటుపద్యములవంటివి. ఇట్టివి మనమహాకావ్యములలోఁ బరశ్శతము లున్నవి. ప్రాస్తావికశ్లోకములు, సుభాషితనీవి, విశ్వగుణాదర్శము, సుభాషితత్రిశతి, సుభాషితరత్నభాండారము, మున్నగుమహాగ్రంథములు గలవు. శతకములు నట్టివే యనవచ్చును. భ్రమరగీతాదులు నట్టివే. ఆంధ్రమునందు ననేకము లున్నవి. చాటుపద్యమణిమంజరి నరయుఁడు. ఇఁక నేఁడీఖండకావ్యములే మనోహరము లనియు నూతనము లనియు ననన క్కఱలేదు. అయినను నేఁడు పుట్టుచున్న వానియం దేకో నవత్వ మున్న దనుకొందము. కాని "పూర్వులవి" నేఁటివారివి భావములను మేళవించి రచించుచున్నారు. అప్రయత్ననిపతితపూర్వసన్నాభనసౌభాగ్యమునకు సంతసించి యధునాతనభావసత్తాపరిశీలనమును జేయుదము.

భారతిలో భావకవిత్వప్రభావమును భాషాభ్రంశప్రశంసయు విస్తారముగ నున్న దని తత్తత్ప్రకటితపద్యాంతర్విన్యస్తాంగ్లప్రశ్నచిహ్నాంకితములే చెప్పుచున్నవి. తత్సంపాదకులును ప్రబుద్ధాంధ్రాదిపత్రికలలోఁ దమకున్న భావకవిత్వభావమును జేటపఱచియే యున్నారు. అయినను నేదో నిర్బంధ ముంటఁ బ్రకటించుచున్నారు. ఇట్లే కొంద ఱున్నను మఱికొంద ఱుద్దండస్వాతంత్ర్య మంతయును వాఙ్మయంబునఁ జూపుచుఁ గవులందఱు నిస్తంత్రు లనుచు నేకలంఘనముగ విహరించుచున్నారు. ఇట్టి సాహిత్యమును సంపాదనయు గర్హ్యమని బ్ర. శ్రీ నందూరు బంగారయ్యగారు రాజమహేంద్రవరమున నుపన్యసించిన ట్లాంధ్రపత్రిక ప్రకటించెను. ఆయామహాపురుషులు తమలోఁ దాము వితర్కించుకొన్నచోఁ దమయర్హ్వాతలు బోధపడకపోవు. ఆత్మశిక్ష. ధర్మశిక్ష.

నేఁటివారు కొందఱు తమరచనములను బరిష్కృతములను గావింప నొల్లరు. పండితపరిష్కృత మనియుంట స్వవిజ్ఞానలోప మని తలంతురు. ఇదియుఁ గాలమహిమయనియుఁ గాలోచితముగ నయ్యె మార్పులు వచ్చు ననియు నొకముడిమాట పట్టుకొని యనన్వితముగ విమర్శించుకొనరాదు.

కాలమునుబట్టి సాధారణపరిణతి యున్నను సార్వత్రికము గాదు. అందును గళావిషయ మట్టిది కాదు. కొన్నిలక్షణము లచంచలములై యుండకున్న మూలచ్ఛేద మగును. ఈరహస్య మెఱుంగక పరిణామవాద మాత్రసర్వవాదము గావింతురు. చూడుఁడు- పదికోట్లవత్సరములకుఁ బూర్వమున మనుష్యుఁడును నేఁటిమనుష్యుఁడును మనుష్యత్వప్రత్యాయకముఖ్యసాక్షాల్లక్షణమున సమానుఁడుగనే యుండును. బాహిరము లెట్లున్నను నాంతరము శరీరనిర్మాణానుబంధసత్తాకమూలరూపము సమానము. కాకున్న సమతాబోధకతాజ్ఞానమును బ్రతీతముగాదు. అనుభవవిరుద్ధము. బోధనారూపవ్యవహారసౌలభ్యమునకు గ్రహింపవలసివచ్చినతత్తద్వాదములను బరమార్థముగ గ్రహించుట ప్రాచ్యులకు నచ్చునదే కదా? మనకు గోచర మగునది మాధ్యమికస్వరూప మనియు నామాధ్యమికమునే భ్రాంతిచే నాదిమధ్యాంతవిభాగము చేసికొని తృప్తిపడుచుంటి మనియు భగవద్గీతలో శ్రీకృష్ణుఁడు "అవ్యక్తాదీనిభూతాని" ఇత్యాదిగా నుపదేశించెను. మనలోకమును మధ్యమలోకమే. మన మనుభవించునది యంతయు నైంద్రియికమగుటనదియును మాధ్యమికమే. జడాద్వైతవాదులును నాద్యంతముల నిరూపణమున నిరుత్తరులు గావలసినదే. పరిణామ మనుటకన్న వివర్త మనుటయే న్యాయ్యముగ నుండును. ఈపరిణామ చక్రము నియతభ్రమణముతో నున్నది. కాని కాలాదిపరిచ్ఛేదకత్వ మైకాంతికలక్షణముగాదు. కావునఁ గాలోచితపరిణామ మగుట దుర్నివార మని పూన్కి మానరాదు. లాంకషైరులాగులే కాలమునకుఁ దగిన వని యూరకుండిరా ! నాటుగుడ్డలనీటు పాటింపలేదా ! ఆంగ్లమే విద్యామూల మని చేతులు ముడుచుకొనిరా ! స్వభాషాముఖదర్శనము సేయు లేదా ; ఇంతయేల ? కాలమువలనఁ బ్రాప్తమైన జ్వరాదివ్యాధులను నిర్వర్తింపలేదా ? స్వస్థవృత్తము నుపదేశింపలేదా ? దేహము కాల

వశమున పడలినను సవరింప సాధనాంతరములఁ గనుఁగొనరా? అపరిహార్య మని యలసుల మగుదుమే? మార్పు నాఁపుట యన నేమియో దృఢముగ నెఱుఁగఁదగును. వ్యాధినిదానము నెఱింగి స్వస్థునిఁ జేయునట్లే యాధిలక్షణమును దెలిసి స్వస్థము గావింపవలయును. సాహిత్య మస్వస్థమై మూల్గుచున్నది. చికిత్సగావింపవలయును. అస్వాస్థ్యరూప మగు నీమార్పు నాఁపవలయును.

సాహిత్యము కాలబద్ధమా యనుశంక నుత్తరించుకొందము. అవ్వలఁ దదీయ స్వస్థత్వాది విచికిత్స వివేకింతము. కాలకృత మన్నచో సనాతనధర్మము సత్యము ననుట కల్లయై వేదాదుల సాహిత్యము ప్రకృతోపయోగి కా దనవలయును. తత్తత్కాలీనము లవ్యయాంశము లున్నను బ్రకృతకాలీనలీనములై యుండవలయును. కాకున్నఁ బ్రకృతమును గాదు. నిన్నఁటి దేవదత్తుఁడు నేఁటిదేవదత్తుఁ డని యభిజ్ఞాత మగుటలో దేశకాలాద్యనవచ్ఛిన్న దేవదత్తేత్యభిజ్ఞానప్రతిజ్ఞాంశైక్య మఖండముగ నుండవలయును గదా? అట్లే కాలకృతమునకుఁ బార్థక్యమును జూపవలదు. కాలకారణకసాహిత్య ముండు నన్నఁ గాదనము. తత్తద్విభాగకారణకము తత్తత్పదార్థ మనుటలో విప్రతిపత్తి లేదు కాని తత్తదనపేక్షితము తత్తదభివ్యక్త మనుటలో విప్రతిపన్నులము గావలసివచ్చును. అంతయుఁ బరస్పరతత్పరక మగును. తీఁగఁ గదలింప డొంక యంతయుఁ గదలును. సారస్వతసాహిత్యకళాలలితకేంద్రస్థానము సుభగంభావుకదివ్యపదం బగుటఁ దత్పదవికిఁ గాలవ్యవచ్ఛేదకత పొసఁగని దగుటనే నిరతలావనఘనప్రాబల్యమున భారతి యేకస్థాయిఁ దనకచ్ఛపిని మీటి వినోదగానము సేయుచు సత్యసౌందర్యాపాదకదివ్యశక్తి ప్రస్ఫురింపఁజేసి బ్రహ్మను ముగ్ధునిఁ జేయుచున్నది. హంస మై మఱచియున్నది. అదియే భారతీసత్యసుందరగానవిశిష్టత. కావునఁ గాలసాన్నిధ్య మఖండదివ్యత్వానుసంధాయకకృతికిఁ గలుగునే.

పరిణామవాదులును మూలభూతకణముల సామ్యమును సమ్మతించియే యున్నారు. పరిణామ మనఁగఁ బూర్వభూతవిఘాతము గాదు.

పూర్వభూతవిశేషము పరిణామము. పరిణామమున స్వాంశత్యాగ ముండదు. స్వాంశవికసనమును స్వాంశాభ్యుదయవిధానానుకూలవ్యాపార విశేషమును బరిణామము.

ఈపరిణామమును జక్రభ్రమణక్రమే కాని యేకధారగ నట్టు మాఱుట కాదు. అనంతత్వ మైక్య మని గణితజ్ఞసమయము. సాంఖ్య తత్త్వమును నట్టిదే. అందువలన వర్తమానకాలమునఁ బొడసూపు నీపరిణామము స్వస్థము నుచితముఁ గాని సంస్కరింపవలయును.

సాహిత్యమస్వస్థమా ? నానాజాతీయభావనలసాంకర్య మనన్వితముగ నసాత్మ్యముగ నంటుటచే సాహితికి వ్యాధియే సంభవించెను. వ్యాధిపరీక్ష కష్టస్థానము లితరమున నున్నను నిందుమాత్రము స్థానస్థాని విచక్షణము గావించి త్రిదోషముల యుపశమనము నాచరించిన స్వస్థప్రకృతిక మగును. ఈవ్యాధికి స్థానము- పరధర్మాభిరతి. స్వత్వచ్యుతికి మూలము పరధర్మాభిరుచియే ప్రధాననిదానజ్ఞులవలనఁ జెప్పఁబడెను. వివిధపదార్థము లారగించినను నవి యన్నియుఁ నెట్లు శరీరరక్తాదిరసత్వ రూపైకస్వరూపము నొంది యారోగ్యము నిచ్చునో యట్లే నానాభావములును మూలభూతస్వభావమునఁ గేంద్రీకరింపఁబడిన భావప్రభ దివ్యాలోకరమణీయమై యానందమును గూర్చును. స్వధర్మహృదయమునందు నీభావము లన్నియుఁ జొచ్చి తమపార్థక్యమునువిడిచి యేకస్వరూపమును బొందునట్లు చేయవలయును. చేయకున్న రోగమే. ఆరోగము జీర్ణించి స్వరూపనాశము గావించును. మేల్కొనుఁడు.

ఆంగ్లహృదయము నాంధ్రవచనమును నాంగ్లధర్మము నాంధ్రకర్మమును నాంగ్లవేషము నాంధ్రదేహమును నాంగ్లాంతరము నాంధ్రబాహిరము నగుచో నందు సాంపరుట ముమ్మాటికిని గల్ల. స్వసంప్రదాయాభినివేశముతో స్వాంశప్రశంసతో స్వాచారాభిరతితో స్వత్వసమాన్నత్యముతో స్వజనాద్యాదరగౌరవభావముతో స్వదేశాభిమానముతో స్వభాషామాధుర్యాస్వాదనాభిరుచితో స్వవేషనిష్ఠతో, స్వీయమును రమణీయమును గావింపఁ దలంపు గలదేని ఫలకమును వరేణ్యమును

నగుఁగాని కేవలపరాధీనసర్వాంతఃకరణచతుష్టయముష్ఠపితినున్న నీకఁ గమనీయత్వాదిహృద్యగుణములేనివ,యమునను బొనఁగవని యనుభవజ్ఞులకు సుగోచరము, విస్తరింపనేల ?

నేఁటిసాహిత్య మట్టియస్వస్థత నుండుటచే సంస్కరింపఁబడవలయును. అసంప్రదాయముగ నుండుటయే యస్వస్థత. అభిప్రాయములు స్వతంత్రము లగుట వికటము గాదు. కాని యనుకరణములును దుస్స్రుతములును ననాచారములును గారాదు. అన్నియు నట్టివి యగుచు స్వత్వవినాశాగ్ని రగులుచున్నది. దానిజ్వాలలు వ్యాపించుచున్నయవి. ఏమగునో? ఆంధ్రసంస్కారములనాంధ్రత్వప్రతిభతో నాంధ్రకావ్యములను బుట్టించిన హితమును బథ్యమును నగును. సీతాదులఁ గులటలఁ జేసి రామాదులను "కాడీ"లను జేసి వ్యాసాదుల నభాజనులఁ జేసి కాళిదాసాదులఁ గల్లబొల్లిచేసి నన్నయాదులఁ జిన్నపుచ్చి పూర్వకళాప్రతిభలఁ బూడిచేసి యిఁకఁ దా నేమిచేయఁగలఁడు ? ముక్కుపచ్చ లాఱని పాలబుగ్గలబాబులు కవిశిఖామణులు నటోద్భటులు నాటకరచనాధురీణులు శాస్త్రకర్తలు విమర్శకవీరులు నగుచో నెట్లుండదో ?

ఇఁక వర్తమానకాలమున సంప్రదాయబద్ధసారస్వతమే లేదందుమా ? ముమ్మాటికిఁ గలదు కలదని చూపఁగలము. వడ్డాది సుబ్బరాయకవిశేఖరుల కావ్యములును, వేదము వారి విఖ్యాతవాఙ్మయంబును, చిలకమర్తివారి మధురరచనలును, జయంతివారి సారస్వతమును కాశీభట్టవారి గంభీరసాహిత్యమును, వేటూరివారి విమలధోరణులును, వీరరాజుగారి విచక్షణలును, దాసుగారి నవవైఖరులును, కవిగారి క్రమోక్తులును, వఝులవారి నిశితవివేకవిమర్శనములును, సెట్టివారి సిద్ధరసికప్రసంగములును, సిద్ధాంతముదొరల యురుకావ్యకళలును, వీరభద్రుల చారిత్రకగ్రంథములును, ప్రాచిపురమురాజుల ప్రవిమలవాగ్విశేషములును, సాలూరుపండితుల సాహిత్యపటిమయు, తాతావారి లోకాతీతశాస్త్రచర్చలును, మఱియు నెన్నియో కలవు. పింగళివారి సుందరవాచకములు, స్థానములవారి నటనాకౌశలములు, కవిహంసల క్రొన్నడకలును, కవిరాజుల నవకల్పనలును, లేవా ? చాలవు. పుట్టిన

దంతయును దేశహితమునకుఁ బుట్టవలయు నని యాశించుటయే పరమార్థము. మఱియు నన్నింట దేశాభ్యుదయనవకల్పప్రతిభలు విస్ఫురింపవలయును. అహమిక లేనియమలశిక్షాభద్రబుద్ధులై విజ్ఞాఁగని విన్ననువుతో నందఱును వెలయుదురు గాక యనియే పరమతాత్పర్యము.

ఇఁక సంస్కారవత్త్వవిశ్వకటుత్వాదుల నుదాహరణముగఁ గ్రమవికాసవిలాసవిశేషములతోఁ దెలిసికొందము. సంస్కృతమునఁ గాళిదాసు నుదాహరించుకొందము. కాళిదాసు సంస్కరించుకొనుచు నిరహంకారముగఁ గావ్యములఁ గళాప్రతిభలఁ బ్రదర్శించెను. ఏగ్రంథము తరువాత దేనిని వ్రాసెనో సప్రమాణముగఁ జెప్పనేరకున్నను శాకుంతలమునకుఁ బూర్వము కొన్ని గ్రంథములు రచియింపఁబడిన వనియు నవి కుమారసంభవాదు లనియు ననుకొనవచ్చును.

ప్రారంభగ్రంథములు కావుననే వస్తునిర్దేశమాత్రముగ రచింపఁబడినవి. మేఘదూతము, కుమారసంభవము ను ప్రార్థనాశ్లోకములు లేక రచింపఁబడినవి. వస్తునిర్దేశముమాత్రము చేయుటవలననే లాక్షణికులు "వస్తునిర్దేశోవాపి తన్ముఖమ్" అని యనిరి కాని "వస్తుమాత్రనిర్దేశము" పక్షాంతరము నాత్యసర్వథానంగీకార్యము నగుట "అపి" శబ్దము చేర్పఁబడెను. మఱియును వాఙ్మయమునందును దత్సదృశరచనములు విరళములు. అట్లగుటచేతనే యనంతరకావ్యములం దెల్లఁ బ్రార్థనాశీర్వాదశ్లోకములతోఁ బ్రారంభము గలదు. ఇది సంస్కారలక్షణము గదా?

కావ్యములును విశిష్టవస్తుభావ్యములై యుండవలయు నని తలంచినవాఁ డగుటనే మేఘదూతమునఁ దక్కనితరముల వస్తువులఁ బవిత్రముగఁ బొందుపఱచెను. శాపహతుఁ డగునొక క్షుద్రయక్షునిఁ బ్రధానము చేసికొని చెప్పుటకంటె నుత్తముల గ్రహించుటయే తగునని యెంచినవాఁ డగుటనే 'వస్తుపురుషబహుమానాద్వా' అని యనంతరగ్రంథమునఁ జేర్చెను. ఇట్లే యన్నివిషయములయందును సూక్ష్మముగఁ బరిశీలించుచో సంస్కరించుకొనుచుఁ గాళిదాసకవి వినీతుఁ డైనట్లు తోఁచును. సంప్రదాయములు నట్టివే కలవు.

వ్యాసమహర్షియు సంస్కృతుఁడై భగవదేకగ్రంథములను వ్రాసి

యందురు. నానావిధదైవపరీక్షల నాఱితేఱిన కవనమునే పాటించినట్లును గలదు. ఆంధ్రభాషయందును రసికులు స్వభాషాకావ్యముల నాదరింతు రని చెప్పి నన్నయభట్టు తెనుంగున సంస్కారవంతముగ భారతమును రచించెను. పెక్కువిధము లగునియమములతో నిష్ఠలతోఁ బరమపవిత్రాంధ్రకవితామాత నుపాసించి యాతల్లిని జాచి చూపించెను. ఎన్నివిధములనో సంస్కరించుకొనుచు వ్రాయుటచేతనే యాంధ్రభారతము కేవలాంధ్రీకరణము గాక యాంధ్రీకరభారతమై యపూర్వశోభతో వెలుఁగొందెను. తిక్కన్నకవియును త్తరరామాయణరచనముకన్న భారతమునందు మిన్నగ రచనాపటిమ ప్రదర్శించెను. కాని కాలము గడచినకొలఁదియు వికటమార్గములఁ ద్రొక్క లేదు. శ్రీనాథపోతన్నలును సంస్కారయుక్తముగ రచియించిరి. పెద్దన్న తిమ్మన్న మున్నగు కవులును సంస్కారమును బాటించిరి. శృంగారరసము నందతివేలముగఁ గొందఱు కవులు వ్రాసినను దదితరవిషయముల జాగరూకులై సంప్రదాయానుకూలముగనే వాఙ్మయమును వృద్ధికిఁ దెచ్చిరి కాని నేఁటివారివలె వెగటుఁదనమును గూర్పలేదు. పూర్వసంప్రదాయావేదకకథలుఁ దత్త్రిమము నెట్లున్నను మొదటినుండి శిక్ష, పరీక్ష, పెద్దలగువారు వినుట, సంతసించుట, సంస్కరించుటయుఁ గలదనుటకు మాత్రము పరమప్రమాణము లనఁదగును.

వ్యాసుఁ డటనట భాషాపాటవప్రదర్శకముగ రచన ముచితస్థలములఁ బ్రదర్శించె నని యు నవియే వ్యాసఘట్టము లనియు ననుటకలదు. “చ”కార బహుళముగా వ్రాయుటచేత నితఁడు “చకారకుక్షిగాఁ” డన్నట్లు ను గలదు. కాళిదాసునందు సమన్వయపఱిచి హృదయంగమముగ నుపమలతోఁ దెల్పుశక్తిగల దని “ఉపమా కాళిదాసస్య” అనియందురు. భారవి కర్థగౌరవ మన విందుము. దండికవితయందుఁ బదలాలిత్యమందురు. ఇట్లే పూర్వులు తమసంస్కారబలమునఁ దమరచనలయందుఁ బ్రత్యేకవిశిష్టతను గడించిరి. వేదాంతముకంటెఁ గడుమిన్న యని కవితను గొండాడిరి. ఇతరశాస్త్రము లన్నియు నట్లే శ్లాఘాపాత్రము లయ్యెను. ఇట్టిస్థైర్య మావాఙ్మయమునకుఁ గలుగుటయందలి సంస్కారసత్త్వవిశేషమని మనీషు లెఱుంగుదురు. అయ్యైరచనములయందలి ప్రసాదాదిగుణమ్ముల

యిమ్ము నేఁటికిని సర్వబుధారాధనీయమై రమణీయమై కడువెలుంగుట యెఱుంగమే. ఆప్రసన్నతయు నాపావనభావనాదీక్షయు నాసంస్కారసామంజస్యము నేఁటివాఙ్మయంబునఁగొ ఆనడి దేశీయహృదయసుప్రకాశవికసనమును గావింపక యుఁ దత్తద్గ్రంథముల యాదరము సన్నగిల్లుచున్నది. అంతయుఁ గాకున్నను విశేషభాగ మట్లున్న దన్నఁ బెక్కండ్రు సమ్మతింతురు. నేఁటిరచన లించుమించుగఁ గేవల దేశీయులఁ బ్రబుద్ధులఁ జేయనివే యగుచున్నవి. సంప్రదాయదూరములు నగుచున్నవి.

వాఙ్మయతత్త్వము:—సాహిత్యము వాఙ్మయము ననునవి తదాశ్రితులకు దివ్యానందమును దదఖిలకల్యాణగుణాభివృద్ధికారకముగ నొసంగకున్న లాభ మావంతయు నుండదు. సమస్తకర్మములును నిష్కామములై చిత్తశుద్ధి నిర్వాహకములై జ్ఞానస్వరూపవంతము లగునో యట్లే నిరంతరపూర్వగ్రంథసమాలోకనాపరిణతధీవిశిష్టతతో సాహిత్యస్వరూపము నొందకున్న లాభ మేమి? కది కావ్యములైన దృఢముగ నెఱుంగక కావ్యరచనమునకు మొదలిడిన నేమిసంస్కార ముండును? పూర్వజన్మవాసన, గురుప్రసాదము, కావ్యావేక్షణము, బుధసహగోష్ఠి, విశ్రుతపరితోషకరచనాపరతయు, గతిపయనియమనిష్ఠాధారణమును లేక యెందో ప్రజ్ఞగల దనియు నన్నింటికిఁ దగుదు ననియు ననుకొనుట కానిపని గాదా! లావరి గారుడ మెఱుంగునా? అందగాఁడు పండితుఁడా? ఆంగ్లమాత్రసంస్కృతుఁ డాంధ్రాద్యగతికభాషల కాచార్యుఁడా? నటకుఁడు కవియా? ధనికుఁడు తగవరియా? ఖద్దరుధారి కాంగ్రెస్సుమూర్తియా? పాటగాఁడు పరమపండితుఁడా? జడలవాఁడు సాధువా? మత్తుమాటలుదాసీనభావములా? పంద యమాయికుఁడా? పిఱికి శాంతుఁడా? క్రోధి వీరుఁడా? అరసి యందలి యానుపూర్వికత నెఱుఁగవలయును. తమ్ముఁ దామే పరీక్షించుకొనుచు నున్న నెల్లదియు లెస్స యగును. కాని నోరికొలంది వాకొన్న నది పసందగునా?

కినియక మనవిని విని మన్నించి చక్కనిబాట గలదేని దానితేట తెనుంగు తేనియలఁ బోని పలుకుల పుప్పొళ్ల వలపించి ముఱియ నరయిక మెలఁగుదముగాక యనుటయే యనంతరవిచార్యము.

సౌగంధికప్రసవాపహరణము.

(పదునాఱవశతాబ్దమునందలి కమ్మవీరులు.)

—కుందూరి ఈశ్వరదత్తుగారు, బి. ఏ. కాకినాడ.—

“సౌగంధికప్రసవాపహరణ”మనుద్విపదకావ్యమును రత్నాకరము గోపాలకృష్ణకవి విరచియించి, వెల్లుట్లగోత్రీయుఁడగు రావిళ్ల లింగభూపాలున కంకితమిచ్చెను. ఈవెల్లుట్లగోత్రసంజాతు లగురావిళ్లవారు కమ్మకులజులు. వీరు సుప్రసిద్ధదండనాయకులై విజయనగరసామ్రాజ్య మేలిన తుళువ, ఆర్వీటి వంశనరపాలు రగునరపతుల సామంతులుగ నుండి, గజపతులతోడ, నశ్వపతులతోడను వారొనర్చినయుద్ధములం బాల్గొని, విజయమును జేకూర్చుచుండిరి. ఈద్విపదకావ్యపీఠికనుండి, కమ్మవీరుల యుదంతమును సంగ్రహముగ వివరించుచున్నాఁడను. బాహుబలదర్పశౌర్యసంపన్ను లగురావిళ్లవారి వృత్తాంతము కమ్మవారికే గాక, యఖిలాంధ్రలోకమునకు సంతోషదాయకముగ నుండఁగలదు. పీఠికభాగములోనుండి చరిత్రకు సంబంధించినభాగము మాత్రమే గైకొనుచున్నాను.

కృతజ్ఞత-గ్రంథపరిశోధనము:—ఈద్విపదకావ్యము క్రీ.శ. 1868 సంవత్సరములో, చెన్నపట్టణమునందు నేలటూరి సుబ్రహ్మణ్యముగారి విద్యావిలాసముద్రాక్షరశాలయందు పిళ్లారిసెట్టి రంగయ్యనాయనివారిచే ముద్రించి ప్రచురింపఁబడియెను. ఆప్రతి నామిత్రు లగు శ్రీనిడుదవోలు వేంకటరావుగారు నాకిచ్చి, దానియందలి చరిత్రాంశములను గూర్చి వ్యాసమును వ్రాయఁగోరిరి. తర్వాత గ్రంథపీఠికభాగమును జదివి, పీఠికలోని చరిత్రాంశములకు సంబంధించిన భాగములు తప్పులతప్పులుగా నుండుటచే, నాంధ్రపరిషత్పుస్తకభాండాగారములో వ్రాఁతప్రతుల నరసి చరిత్రకు సంబంధించిన పీఠికభాగమును, నేనువ్రాసికొంటిని. పరిషత్తువారి పుస్తకభాండాగారములో మూఁడు తాళపత్రగ్రంథము లున్నవి. మూఁడును శిథిలములె. కాని విశేషశ్రమకోర్చి, పరిషత్కార్యవ్యవహర్తలును, పరిషత్పత్రికాసంపాదకులు నగు శ్రీ కొత్తపల్లి సూర్యరావుగారు వ్రాఁతప్రతులను జదివి, లేఖకప్రమాదములను సంస్కరించి, నాకుసాయపడని

చో నే నీవ్యాసమును వ్రాయలేకుందును. శ్రీవేంకటరావుగారికిని, సూర్యరావుగారికిని నాకృతజ్ఞతాపూర్వకనమస్కారములు. ఈసౌగంధికాప్రసవాపహరణకావ్యముయొక్క వ్రాఁతప్రతి చెన్నపురి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారములో నున్నట్లు తెలియుచున్నది[1]. శ్రీసూర్యరాయాంధ్రనిఘంటుకార్యాలయములో నొకవ్రాఁతప్రతి యున్నది, కాని, దానిలో లేఖకులు చరిత్రాత్మకమైన పీఠికభాగమును బూర్తిగ వదలివేసి,ప్రథమ ద్వితీయ, తృతీయాశ్వాసములను మాత్రము వ్రాసియుంచిరి.[2]

ఈవ్యాసము వ్రాయుటలో నేను సంప్రతించిన గ్రంథములనామము లధోజ్ఞాపికలలోఁ జేర్చినాను. అందు రామరాజీయము, వసుచరిత్రము, బాలభాగవతము లు ముఖ్యములు. ఈబాలభాగవతము దోనూరి కోనేరునాథుఁ డనుకవి క్రీ.శ. 1547-48 సంవత్సరములో రచించి, అవుకు చినతిమ్మరాజున కంకితమిచ్చెను. ఈగ్రంథమును చెన్నపురిలో విజ్ఞానగ్రంథమాలిక ప్రథమసంపుటముగ వేదము అండ్ కంపెనీవారు ప్రకటించిరి.[3] తెంజనగర దేవరాజసుధీమణి పరిశోధించిచక్కనిటీకను వ్రాసెను. ఈగ్రంథమిట్లు లోము వ్యాసమును వ్రాయుటకుఁ గొన్నియేండ్లపూర్వమే ప్రకటితమైనసంగతి యెఱుఁగక శ్రీడాక్టరు నేలటూరి వేంకటరమణయ్యగారు, భారతిపత్రికలో ద్విపదబాలభాగవతములోని ఆరవీటివంశావలిని ప్రత్యేకముగ వ్రాసి, యితరగ్రంథములనుండి దానిలోఁ జెప్పఁబడినవిషయములను గూర్చి,ప్రకటించిరి.[4] ఈబాలభాగవతముద్రితప్రతి ఆంధ్రపరిషత్పుస్తకభాండాగారమునందుఁ గలదు. దానినే నే నుపయోగించుకొంటిని. గ్రంథము శ్రీవేంకటరమణయ్యగా రూహించినట్లు చెదపురుగులకాహారముగాక,ముద్రాపకుల పరిశ్రమచే, కొంతవఱకు ముద్రితరూపమును దాల్చియున్నది.

---

1. Triennial Catalogue of manuscripts Vol. II. Part 3. Page 528-530.

2. శ్రీసూర్యరాయాంధ్రనిఘంటుకార్యాలయములో "సౌగంధికము" అనుపేరఁ గల వ్రాఁతప్రతిని జూడుఁడు.

3. బాలభాగవతము—దోనేరు కోనేరుకవి.

విజ్ఞానగ్రంథమాలిక-ప్రథమసంపుటము. (1914)

4. బాలభాగవతపీఠిక- భారతిసంపుటము 6. సంచిక 6.

రావిళ్లవారి వంశవృక్షము.

- మల్లభూరమణుఁడు
  - తిప్పభూపాలుఁడు=పెద్దమాంబ
    - పాపనృపతి=లక్కమాంబ
      - తిప్పనృపతి=వెంగమాంబ
        - లింగభూపాలుఁడు=సిద్ధాంబిక
          - కొండభూపాలుఁడు=రంగమాంబ
            - వేంకటనృపాలుఁడు
            - లింగభూపాలుఁడు=భాస్కరాంబ
              - రామభద్రుఁడు
            - ముద్దులనాయఁడు=తిరుమలాంబ
              - వెంగనృపతి.
          - అయ్యంనాయకుఁడు=అంగమాంబ
            - కొండనృపతి
    - వేంకటాద్రి

మల్లభూరమణుఁడు.

ద్వి. ఆశమ్మవంశసుధాంభోధియందు, రాకానిశాకరరమణఁ జెన్నొంది
యనుపమాటోపసాహసవిక్రమార్కుఁ, డనుచు రాయకుమారు లభినుతింపఁగను
గోమరొండ గుడిపాటికోటచెంగటను, ...
కుకలాధిపతు లెల్లఁ గొనియాడి మెచ్చ, కుతుబుశాహబలంబు ఘోరించి సఱికి
చెల్లగా రాయలచే హెచ్చుబిరుదు, లెల్లఁ గైకొని మదాహితరాజన్యదవ
భల్లప్రతాపప్రభావుం డనంగ, మల్లభూరమణుఁడు మహిఁ గీర్తిగాంచె
....

తిప్పభూవిభుఁడు.

రవివంశమునను శ్రీరామచంద్రుండు, భువి నుద్భవంబైన పోల్కి జన్మించి
జనవాఘు లెన్నఁగా జగతిపై వెలసె, ...
ధీరుఁడు రావిళ్ల తిప్పభూవిభుఁడు, హేరాళముగ ధాత్రి యేలుచునుండి
భుజబలోద్దండుఁడై భోదలును పమ్ము, గజపతిదళములు గడిసి చెండాడి
వికలంబుగాఁజేసి వెన్నంటి కడిమి, ...
జనపాలు రెన్న రాజ్యము సేయుచుండె
పరమసాధ్వీమణి పటుశీల యనఁగఁ, బరఁగు శ్రీపెద్దమాంబాగర్భమునను
హరిహరసదృశులై యలరిన సుతుల, నిరువురఁ గాంచె మహేశసన్నుతులఁ
వరశౌర్యధనుఁడు పాపన్నమకలేంద్రు, వలఘుతేజుఁడు వేంకటాద్రిభూవిభుఁడు
నరయ వాయునుపురి మందగ్రజుండు, పరమపావనుఁడు పాపన్నమలలేంద్రుఁ
డతిశీలవతి లక్ష్మమాంబికయందు, సుతుని తిప్పన్న వసుంధరాధిపుని
గని పెంచి సకలభూకాంతులు గొలువ ....

పాపభూకాంతుఁడు.

వేలుగుల్క? రాయవజీరుఁ డనుచు, ముగురు దుజేదార్లు మెచ్చి సన్నుతింప
బాపురే మాయయ్య భళిభళి యనుచు, గోపాలరాజుఁ జేర్కొనిమాచి మెచ్చ
సరకు సెకుకు లేక యావహాభూమి, తెలుఁగుబిజలుమాడ్కిఁ దెగువతోఁ జొచ్చి
మొనసి కర్నూల్ కోట ముట్టడివేసి, మునుము న్నె విడిపించి మోహరంబైన
బలుదునేదారుల భంజించివైచి, పాలుపొంద గంధేభముల మగ్గఁజేసి
పాదలుగ నీబుల పొంక మణంచి, రెండురపట్టాణీల నెల్లమట్టాడి
చెలరేగి యొకసి హెజీరుల దునిమి, కలదక్కనీల చీకాకు గావించి
జేరాల శ్రాక్షన్ని తెగఁజుకించి, కోరి భండారము లొక్కల్ల లాడించి

తన షేరివారి కందనవోలుకోట, యనురాగమునఁ జొచ్చి యారాజుచేత
మెచ్చులు గైకొని మేదినీపతుల, నిచ్చ మెచ్చులు చూచి నృపులెల్ల నితఁడె
గెలుపులరాజని కీర్తించి పొగడ, విలసిల్లి రణకేళి విహరించె నెలమి.

....

తిప్పనృపతి.

అతనికనూభవుం డగుతిప్పనృపతి, కుతలాధిపతులెల్లఁ గూర్మితో మెచ్చ
ధరణి షేరైన యాదవని దుర్గంబు, సురతాణిలగ్గగాఁ జూఱలాడించి
తగువజీరుల దుసేదారులఁ జంపి, పోరుతురుష్కులఁ బోనీక చంపి
సకలపాలియగాండ్ల జీకాకుచేసి, చెలరేగి జయలక్ష్మి చేకొనివచ్చి
చల్లనివాఁడని జనులు నుతింప, నిల మహీపతులెల్ల నేలుచునుండె.

లింగభూపాలుఁడు.

అంగనామణి... యలినీలవేణి, శృంగారవతియని చెలువొందినట్టి
వెంగమాంబికయందు వితరణకర్త, లింగభూపాలు లాలితయశోధనుని, గనియె

....

కొండభూపాలుఁడు.

ఆలింగభూకాంత శేఖరుండు, పరఁగ సప్తాపుల పర్వతాధిపుఁడు
గన్నసిద్ధాంబిక కరుణావలంబ, చెన్నుగాఁ బెండ్లియై యొసఁగుచునుండి
వీరజాస్త్రప్రభానిశితాధివిదిత, ఘోరటాతనృపాలు కొండభూపాలు
సతతవదాన్యప్రసన్నసత్కాంతి, జితచంద్రు నయ్యలక్షితినాథు
పుత్త్రులుగాఁ గాంచి పొలుపువహించె.

కొండభూపాలుని కుమారులు.

ఆకుమారులలోన నహితరాజన్య, భీకరశౌర్యుండు భీమబలుండు
బలభేదివిభవుండు పటుబెళగంటి, జలరాశి టంకశుంభత్ప్రౌఢిరాజ్య
పురహారకల్లోల, భువనబేతాళ, పరసైన్యభైరవ, బల్లాలరాయ
గండోగ్రజగనొబ్బ చండప్రచండ, గండరగండ విఖ్యాతకేళాది
రాయబాళాసి దుర్గవిభాసిచటుల, గాయగోవాళ రక్తచ్ఛత్ర బసవ
శంకరసర్వశ నిశ్శంకసాహసుని, వేంకటభూపాలు విమలచారిత్రు
సంగరాటోపప్రచండాధిరాజ, పుంగవు ప్రాభవ భుజగర్వహరణ
కరుణాపయోనిధి గాయగోపాల, బిరుదాంకుఁ డగులింగపృథ్వీతలేంద్రు
గద్దరి రిపుపీఠగజసింహమూర్తి, ముద్దులనాయుని మోహనాకారు
నిటుకంటి నవయుల నిరవొందఁగాంచి, పటుసత్యశీలుఁడై ప్రబలుచునుండె.

అయ్యపనాయఁడు.

బలియుఁ డాకొండభూపాలసోదరుఁడు, విలసితసాహసవిక్రమార్కుఁడు
గురుతరపరవీర కోలాహలుండు, వరభవ్యగాంగేయవర్ణకేతనము
రాజిల్ల వెలయు కర్ణాటశ్రీరాయ, రాజసత్యకిరీట రమ్యభూమణుఁడు
మనసిజాకృతి చెంచుమలచూరకార, ఘనబిరుదాంకుండు కలితతేజుండు
వినుతుఁ డయ్యపనాయకేంద్రుండు, ధరణీశు లెన్న భూస్థలి వార్తకెక్కె

అయ్యపనాయనిపుత్త్రుఁడు కొండనృపతి.

ఆమోద మెసఁగ నయ్యపనాయకేంద్రు, భామిని యంగమాంబామణిగర్భ
జలనిధిసంపూర్ణచంద్రునిలీలఁ, గలిగె శ్రీకొండభూకాంతశేఖరుఁడు.

లింగనృపతికుమారుఁడు కొండభూపాలుని శౌర్యము.

రాజతేజుండగు రావిళ్ళలింగ, భూజాని కొండభూవిభుఁడు మోదమున
పాలయుచుఁ బుత్త్రిల శుభముహూర్తమునఁ, జెలఁగుచు రాజ్యాభిషిక్తుఁ జేసి
మంతుకెక్కిన మేటిమన్నీలతోడఁ, బంతముల్గలధరాపాలురతోడ
బలువిడి చతురంగబలములతోడ, వలనొప్పు బలువైభవంబులతోడఁ
గరవరదీప్తుల కరవాలుఁబూని,... సల్లలచికిలిపచ్చలబాకు వట్టి
కరలకెంపులు బాసికంబులు దాల్చి, తరలక కరవీరదామంబు బూని
సిరిగుల్కు రత్నాలసింహతలాటు, బిరుదాంకములు చాల పెంపొందుజవన
తురగంబు నెక్కి యాతురమగు వేడ్క, సరసులు వీరసేసలు చల్లుచుండ
గొప్పరెజ్జనిపట్టు గొడుగులనీడ, నొప్పు చల్లనిగాలి యొనవుచుండఁ
జెలువొంద జయలక్ష్మి చేకొనుకొఱకు, వలుకుచు వనిపెండ్లికొడుకు చందమునఁ
బొదలుచు మానవపురిచెంత జేరి, వదరి నేకులు బాహుబలములమీద
కొదవక హరిణంపు గుంపులుగాంచి, కొదమసింహము చొచ్చుకొనుచు చెన్నొంద

....

నెదురు రావుతుల నెలమి హాళిర్ల, బొదలు దునేరాగ్ల పుడమిపైఁ గూర్చి
హత్తిజెంబడి వచ్చు నవనీశు లెల్లఁ, దత్తరం బగువేడ్క దండంబువెట్ట
నిరువొంచల్ నలిగిన నేదిక్కుగన్న, ధర డొల్లి యాదెసతలలును మఱితీయు
నెడనెడుగాత్రంబు లెగురురక్తములుఁ, బొడిదైనశల్యముల్ పొలియు రాహుతులు
గలిగి యొప్పెడు మహాకదనరంగమున, వెనుకబెదురుటను లేక వనిసేయు వేళ
వేయాలు పెద్దగా వీఁపున నెడలు, గాయముల్ మణిపతకంబులు గాఁగ
వెక్కసంబున మేన విఱిగిన యలుగు, లక్కజంబగు వరహారముల్ గాఁగఁ
బెనఁగొని మైవ్రేలు ప్రేవులసొబగు, తనకు నుత్తరజన్నిదంబులు గాఁగ
..............................,భూనక్రమము వహించి పోరిలో నెలసె.

కొండభూపతికుమారుఁడు లింగనృపాలునిశౌర్యము.

ఘనుఁడు రావిళ్ల లింగనృపాలచంద్రుఁడు, దేవయు వేఙ్కల ధాత్రినేలుచునుండె
.............................,రతిదేవి యనఁగ ధరాస్థలి వెలసి
పరఁగు శ్రీభాస్కరాంబాపయోజాక్షి, వరముహూర్తమున వివాహమై ప్రేమ
లోనర భావింపుచు నుచితవైఖరుల, వినుతకీర్తుల ధాత్రి వెలయుచునుండె
.............................,పరఁగు శ్రీభాస్కరాంబామణియందు
సరసరూపవిలాససత్కళామూర్తి,...........................
రామభద్రనృపాలురమణీయశీలు,...........................
బలరామసత్వసంపన్నుని గాంచి, చెలఁవు మీఱఁగను బోషింపుచునుండె
.............................,ధరణీశులేకు లెంతయు సన్నుతింపఁ
అరిమణికోటలో స్థిరముగా నిలిచి, పరవీరదుర్గముల్ పట్టణంబులును
వదలించి భేదించె ననువార్త దెలిపి, పొదలుచు నాకఁడు పోఁగుమార్గముల
మలయు మన్నెదార్ల మన్నీలఁ బిలిచి, పెలవుసన్నించిన శిక్షుంబె మరలి
చతురంగబలహితసంరంభు లగుచు, ధృతిమీఱఁగా నలుదెసలను గ్రమ్మి
యుదయాస్తమయములనరిమిల్గ్గ,లుదరించిన ఆకి మహోగ్రశౌర్యమున
డాబలుపైఁబడి డాగులుచేసి, జీబులు బలసిన సేనల దురిమి
మన్నీలదొరల సామంతులఁ జెండి, వన్నెకునెక్కు శేకంతులఁ జదిపి
.............................,యాలంబులోఁ జొచ్చి యఖిలశాత్రవులఁ
దోలి పెన్గొండకుఁ ద్రోవలు చూపి, కురువీరబలములఁ గూల్చినయట్టి
నరుఁడీవిభుం డని నరనాథు లెంచఁ, గడిమిన శత్రువు ల్గళవళమందఁ
జెదరిపోవఁగలేక చేతులు మొగిచి, కావుము బసవశంకరబిరుదాంక
ప్రోవుము బెళగంటి పురిశిలాటంక, శరణాగండరగండ శత్రువిభాళ
కరుణించి రక్షించు గాయగోవాళ, కీర్తించెదము మిమ్ము కేళాదిరాయ
యస్థుల మన్నింపు మస్థి వేడెదము, అనివేడుకొనిన దయాదృష్టిఁ జూచి
తనర వేఙ్కల ధర్మదారవట్టించి, సమరంబు చాలించి చయ్యన మరలి
రమణతో దారల రమణుల చేత, దళవాయి వేంకటధరణీశుచేత
నలరుచు హెచ్చుగు నటు మెచ్చులంది, రావిళ్ల లింగభూరమణచంద్రుఁడు
పావనచరితుఁడై ప్రబలుచునుండె,............................

లింగభూపాలునిసోదరుఁడు ముద్దులనాయునిశౌర్యము.

ఆలింగధరణీనాయకసోదరుండు, ...
నలువొందు ముద్దులనాయకేంద్రుండు, బలభేదివైభవభాగ్యసంపదల
సమరాంగణకిరీటి శాత్రవధరణి, రమణత్రిదశకోటి రణరంగవిజయ

ధాటీ ఘోటకఖురోద్ధత వైరికోటి, కోటీరవాటిసద్గుణమణిశ్రేణి
యగు కోటపాటి మాకావనీంద్రునకు, లగనుద్భవించిన తరుణీలలామ
సరసకళాధామ సౌందర్యసీమ, తిరుమలాంబామణి స్థిరలగ్నమునను
వెలఁగి కల్యాణమై సిరులచే వలసి, రోలమి ధరాస్థలి నేలుచునుండె
.........................., గాంగేయనగస్థైర్య గాంగేయశౌర్య
వెంగధాత్రీనాథు విమలచారిత్రుఁ, దనయునిఁగాఁగాంచి ధరణీశుఁ డెన్న
వినుతసంపదలచే వెలయుచునుండె.

ప్రథమాశ్వాసాంతమున కృతిపతివర్ణనము.

సుకవిపోషణుఁ డేర శుభమూర్తి పేర, సకలపురాణార్థసంగ్రహుం డేర
వాదవసీకుగ్గహరణుని పేర, చేదిభూవరదత్తసింహతలాట
కరపోటన్నపదత్తకనకపతాక, నరపతిదత్తనానావర్ణరాయ
బిరుదాంకు పేర గంభీరాబ్ధిపేరఁ, గర మొప్పు జగనొబ్బగండని పేర
శతనృపాలక శైలశరకోటిపేరఁ, గతిచారాధిమగ్గవిభాళ పేర
....

తృతీయాశ్వాసాంతమున.

పెమ్మకొక్క సర్వేశవంతుని పేర, మహనీయచిత్రమేపుధ్వజు పేర
సరసారుణోజ్జ్వలచ్ఛత్రుని పేర, గురుతరవెల్లులగోత్రుని పేర
నరపతిదత్తనానారత్నభూష, కరితురంగ కళాంకఘనభాగ్యు పేర
సింధురాజార్పితసింధురచిత్ర, సైంధవబంధురస్యందను పేర
సౌరాష్ట్రనృపదత్త సలలితరత్న, హారుని పేర దీనావను పేర
రణధీర ఘంటానిరాతంకమల్ల, ప్రణుతసింహతలాట పరబలభీమ
నిశాత్యభిరామ నిర్నిద్రప్రతాప, సత్యహరిశ్చంద్ర సంగరరక్ష
పాలకగాయగోవాళిమహావీర, రేశాదిరాయ సత్కీర్తికలాప
చలమర్తి వరగండ జగనొబ్బగండ, కవితాదపనిమర్గగర్వవిభాళ
హత్తుముప్పరగండ పార్యతశౌర్య, మత్తారిమదభంగ మదవావశౌర
కనకవసంతాంక గగ్గోలురాయ, ఘనతరప్రజమెచ్చు గండాదిఘోర
బిరుదాంకు పేర గంభీరాబ్ధి పేర, వరభోగనిర్జిత వాసవు పేర.
....

రావెలవారి వృత్తాంతము.

కుమారధూర్జటి కృష్ణరాయవిజయమునం దీరావెలవారిని గూర్చి ప్రశంసించెను. కృష్ణరాయలు కళింగదిగ్విజయయాత్ర వెడలినప్పుడు తోడ్పడిన వీరనికాయములో రావెలవారు గలరు. వీరు కృష్ణరాయలపక్షమున నుండి సమరరంగమున గజపతిదళముతోఁ బోరాడినవిధ మీక్రింది విధమునఁ గవి వర్ణించెను.

ఉ. శీవిగ సాళువారును గడిందిరహిన్ వెలుగోటివారలా
రావెలవారుఁ గూడుకొని రాత్రిపగల్ చతురంగసేనతో
సేవగఁ జూచినం దెలియ నెంతయుశక్యము గానిదుర్గ మా
భూవరమౌళిగాంచి యొకపూఁటనె దీసెదనంచు నుగ్రుఁడై. 3-59

విశ్వనాథనాయని స్థానాపతి వ్రాసిన రాయవాచకము (పుట 65) లోఁ గమ్మనాయకుల ప్రశంసకలదు.

"పెమ్మసాని రామలింగనాయుడు హండే మల్లారావు బోయి రామప్ప హరివాణం కొమాళ్లయిన పదునెనిమిది కప్పణాలవారున్ను దళనాయకులు అప్పరపిళ్ల కుప్పరపిళ్ల సాళువనాయుడు కొమారతిమ్మప్ప సంగ్గరాజు చెర్వ్రప్రధాని తిప్పరసు అయ్యప్పనాయుడు కొటికం విశ్వనాథనాయుడు చెవ్వప్పనాయుడు అక్కప్పనాయుడు కృష్ణప్పనాయుడు వెలిగోటి యాచమనాయుడు కన్నడ బసవప్పనాయుడు సాళువ మేకరాజు మట్ల అనంతరాజు తిమ్మరాజు వీరమరాజు మొదలైనవారున్ను బొంమ్మిరెడ్డినాగారెడ్డి బసువారెడ్డి మొదలైనరెడ్డికొమాళ్ళున్ను కమ్మనాయకులు విఠలప్పనాయుడు."

రాయలు మహమ్మదీయులపై దండు వెడలిన యెడ కమ్మనాయకులను గూడ యుద్ధరంగమునకుఁ గదలిరమ్మని కబురుపంపించెనఁట. (రాయవాచకము పుట 84)

"సాళువతిమ్మరుసయ్యగారినింన్ని పట్నమంద్దు వుంచి దండ్డుయాత్రకు జయధ్వనిగా దిక్కులు పిక్కటిల్లేటంద్దుకు భేరితాడనము శేశి డమామి

టోకించమని ఉత్తరువు శేశి రాతులకు మాపుత్తులకు అమరనాయకంవార్లను, అల్లుండ్లు, కొమాళ్ళకు, రాజులకు, జెట్లకు, కంమ్మనాయకులకు అందరినిన్ని వయనం చెప్పిరమ్మని"

కృష్ణరాయవిజయ, రాయవాచకముల ననుసరించి, యీకమ్మదండనాయకులు రాయల సామంతులై యుండి, యాతఁ డొనర్చినదండయాత్రలయందు గజపతులతోడను అశ్వపతులతోడను యుద్ధ మొనర్చు చుండి రని విశదము కాఁగలదు.

సౌగంధికప్రసవాపహరణమునందు కవివర్ణించిన విషయములు చరిత్రాత్మకములై యుండుటయే గాక, పదునాఱవశతాబ్దమునందు విజయనగరసామ్రాజ్య మేలిన సాళువ,తుళువ, ఆర్వీటివంశనరపాలురు కృతులందిన ఆంధ్రకావ్యములందును వర్ణితము లయ్యెను. ఈకమ్మదండనాయకులు విజయనగరసామ్రాజ్యచక్రవర్తులకు సామంతులుగ నుండి, రాజకార్యనిర్వహణపారీణులై, విక్రమధనంజయులై, వితరణరాధేయులై, పండితపోషకులై ప్రఖ్యాతిని గాంచి, కీర్తిశేషు లయిరి. సౌగంధికప్రసవాపహరణకృతికర్త యగులింగభూపాలుఁడు దళవాయి వేంకటధరణీశుచే మెచ్చు లందె ననియు, నతఁడు, ఆదవనిదుర్గవిభాళుఁ డనియు, నరపతిదత్తనానారత్నభూషకరితురంగశతాంగఘనభాగ్యుఁ డనియు, శత్రునికాయమును గెల్చి వారిని యుద్ధభూమినుండి పలాయనులఁ జేసి, పెనుగొండకు దోవలు చూపె ననియుఁ దెలియుచున్నది. ఇతనిపినతండ్రి యగుఅయ్యప్పనాయఁడు "రామరాజసత్యకిరీటరమ్యభూషణుఁడు" కావున, కృతిపతి, అళియరామరాయలకాలములో నుండె ననుట స్పష్టము. అళియరామరాయలకు "పెనుకొండ దుర్గసాధకుఁ డనియు, ఆదవేనిదుర్గాపహరణుఁ డనియు" బిరుదు లున్నట్లును నాతఁడు వానిని గెల్చినవిధమును రామరాజీయములో (ప 278-79) వర్ణింపఁబడెను.

గీ. అవని నిటువలెఁ బుత్రపౌత్త్రాభివృద్ధి
రహిని వర్ధిల్లు తిరుమలరాయవేంక

టాద్రిరాజానుజద్వయ మధికభక్తిఁ
గొలువ నళిరామభూపాలుఁ డలరు మిగుల.

గీ. సకలవిభుతిమ్మరాజుసేనలను ద్రుంచి
గుత్తిఁ బెనుగొండ మఱిగండికోటఁ గంద
నోలుపుర మాదవని సవలీల గెలిచి
తొలుదొలుత రామనృపతి దోర్బలము మెఱపె.

రామరాజభూషణుఁడు వసుచరిత్రములో రామరాయలనుగూర్చి వ్రాయుసందర్భమున (ఆ ౧. ప ౪౪) పెనుగొండ, ఆదవని (Adoni in the present Bellary District) దుర్గములను సాధించినక్రమము నీక్రిందివిధమున వర్ణించెను.

సీ. పట్టాభిషేకవిపర్యయంబునఁ బ్రోలు
వెడలి ప్రియానుజుల్ వెంటఁ గొలువఁ
జిత్రకూటాభిఖ్యఁ జెలఁగు పెన్గొండ సాం
ద్రహరిద్విపేంద్ర నాదవనిఁ జెంది
ఖలజనస్థానవాసులఁ బల్వుర వధించి
మహిమ సకలఖరస్మయ మడంచి
హరివీరభటమహోద్ధతి నభిగంపింప
దురమునఁ గడిసి తద్ద్రోహిఁ దునిమి

తే. యనఘతరపార్థివేందిర నధిగమించి
సాధుకర్ణాటవిభవసంస్థాపనంబు
పూని శరణాగతుల నెల్లఁ బ్రోచె రాముఁ
డతఁడు నిజచరితంబు రామాయణముగ.

రామరాజరమ్యకిరీటభూషణుఁ డైన అయ్యాపనాయఁడు, కృష్ణరాయలకాలములో నుండి, యతని దండనాయకుఁడుగా నున్నట్లుతోఁచెడిని. రాయవాచకము (పుట 65) లో, వివరింపఁబడిన నాయకులలో నీతఁ డొకఁడు. లింగభూపాలునితండ్రి యైనకొండభూపాలుఁడు మానవ

పురిచెంత నేములఖానుని జయించినట్లును, ఈకొండభూపాలునితాత యగుతిప్పన్న యాదవనికోటను సాధించినట్లును సౌగంధికప్రసవాపహరణమునందుఁగలను. ఈపౌత్రుఁడును పితామహుఁడును-అళియరామరాయల తండ్రియుఁ దాతలకాలములో నుండి, వారొనర్చిన సంగరరంగములందు సాయపడుచుండిరి. అళియరామరాయలతండ్రి మైనతిమ్మరాజు మానవపురికడ నేములుఖానుని జయించినట్లును, ఆదవేనిదుర్గము ను సాధించినట్లును ద్విపద బాలభాగవతమునందును బద్య బాలభాగవతమునందును వర్ణింపఁబడెను.

"రాజచంద్రుఁడు రామరాజుతిమ్మయ్య ... ...
కడిమిమై మానువకడ రణక్షోణి, గడుసరి నేములఖాను జయించె
విక్రమంబున నాదవేని దుర్గంబు, విక్రాంతులెన్న వేవేగ సాధించి.[1]
"... ... ...మానువకడ సవాబూని పోరను బరా
జయమునొందించె నేశౌర్యశాలి.[2]

తిప్పనృపతి తండ్రియగు పాపనృపతి కర్నూలుకోటను ముట్టడివేసె నని వర్ణింపఁబడిన విధముననే, అళియరామరాయలతాత యగు (తిమ్మరాజుతండ్రి) రామరాజు కందనవోలు (కర్నూలు) ముట్టడివేసిన విధమును, బద్య బాలభాగవత, ద్విపద బాలభాగవతములందును, రామరాజీయవసుచరిత్రకావ్యములందును వర్ణితము.

"రామనృపాలుండు రాజేంద్రుఁ డౌదవె
నెందు నెన్నఁగఁ జాలునిద్ధశౌర్యమునఁ, గందనవోలిదుర్గంబులోనుండి
బుక్కయరామభూభుజుఁడెల్లనృపులు, నెక్కువయిదియని యెన్నంగఁజాలి
పీరులు డెబ్బదివేవు రాశ్వికులు, చేరికొల్వంగ వచ్చినసవా నెదిరి
కలనంది పంచబంగాళంబు సేసి, గెలిచెఁ దచ్చరితంబుఁ గీర్తింపఁదరమె"[3]

---

1 ద్విపదబాలభాగవతము ప్రథమస్కంధము. పంక్తులు 261-270 పుట 20.

2 శ్రీవేంకటరమణయ్యగారు ప్రచురించిన ద్విపదబాలభాగవతపీఠిక. భారతి. సంపుటము 6 సం 6 దానిలో వారు పద్యబాలభాగవతమునుండి వ్రాసినసీసపద్యపాదము

3. Sources of Vijayanagar History, pages 205-206.

బాలభాగవతము. ప్రథమస్కంధము పంక్తులు 191-195 పుట 15.

"గబ్బిల్ డెబ్బదివేవురాశ్వికులు వేడ్డన్ గొల్వఁగాఁ గిష్న పె
న్నబ్బిల్ గప్పఁగఁ గందనోలు కొనువేడ్డన్ జుట్టుముట్టన్ సవా
బిబ్బీ నుబ్బణఁగించి తోలె నరిరాడ్భీముఁడు లంకాపుర
న్యబ్బేంద్రాభుఁడు బుక్కభూవిభునిరామాధీశుఁ డాహాయనన్.[1]

సీ. మదకరి కోకటి కిర్వదిగుఱ్ఱములు గుఱ్ఱ
మునకును విలుకాండ్రు ముగురు విచ్చు
కత్తులవా రిఁ దెకాండ్రట్ల వరిల
నిట్టియేచుఁగులను జుట్టి మూఁడు
వేలవేనూఱు నుద్వృత్తితో నడపంగఁ
గందనో ల్సాధింపఁగాఁ దలంచి
మొనద్రుంచి గట్టిగా ముట్టడి దిగిన నా
బిబ్బని మిక్కిలి యుబ్బణంచి

గీ. ప్రకటసప్తాంగములఁ గొని రామవిభుఁడు
కందనో ల్రాజధానియుఁగాఁగ వసుమ
తియును నేలి మహాహవదీక్షఁ బూనె
బలిమి కలిమి నాశావనీపకులఁ బెనుప.[2]

వసుచరిత్రములో (1 ఆ. ప. 29-30) రామరాజు కఁదనోలిపురీని
శాంతుఁ డని వర్ణింపఁబడెను.

క. ఆబుక్కనృపతి కతులభు
జాబందీకృతమదాంధశత్రురమావే
ణీబంధవిలసదసిధా
రాబంధురుఁ డైన రామరాజు జనించెన్.

సీ ... ...

---

1. పద్యబాలభాగవతము నుండి శ్రీ వెంకటరమణయ్యగారువ్రాసినపద్యము.
2. రామరాజీయము. పుట38-39ప, 209.

సీ. అతఁడు మతిమంతుఁ డతిశాంతుఁ డరికృతాంతుఁ
డనుపమస్వాంతుఁ డాశ్రితవనవసంతుఁ
డనఘతరకందనోలిమహాపురీని
శాంతుఁ డగురామమేదినీకాంతుఁ డలరు.

అళియరామరాయలతాత యైనరామరాజు సాళ్వ నరసింహరాయల సామంతుఁడుగ నుండి యతనిదండనాయకుఁడై, యాతని యాజ్ఞానుసారముగ కర్నూలుకోటను ముట్టడివేసినట్లుచరిత్రవల్లఁ దెలియుచున్నది. అళ్లి కర్ణకులచంద్రుఁడైన పాపనృపతియు, నొక సేనానాయకుఁడై రామరాయలకర్నూలు దండయాత్రలోఁ బాల్గొనియుండును.[1]

పాపనృపతి తండ్రి యైన తిప్పభూపాలుఁడు గజపతిదళములతోఁ బోరాడినట్లును మల్లభూరమణుఁడు కుతుబుషాహిబలమును జెండాడినట్లును గవి వర్ణించెను. సాళువ నరసింహరాయ లొకవంక గజపతులతోడను, మఱి యొకవంక నశ్వపతులతోడను యుద్ధము లొనర్చిన సంగతి చరిత్రప్రసిద్ధము. అతనికాలములోఁ, దెలింగానా, బహమనీసుల్తాను సామంతుఁడుగ కూలీకుతుబుల్ముల్క్ అనునాతఁడు పాలించుచుండెను. ఇతఁడు క్రీ. శ. 1495 మొదలు క్రీ. శ. 1512 వఱకు సామంతుఁడుగ నుండి, తర్వాత బహమనీసుల్తానుని ద్రోసిరాజని, ఆసంవత్సరముననే కుతుబుసాహా యనునామమును దాల్చి స్వతంత్రుఁడై గోలకొండనుండి పరిపాలన మారంభించెను.[2] ఆ కాలములో బీజపూరు,

---

1. Kurnool District Manual, Page 24.

"Narasingarajah further instigated by the minister of the last Bahamani King Mahmad, who bore ill-will towards Mahmud-Yusuf Hdil Savai, the then Governor of Bijapur, despatched his general Ramarajah(grandfather of his name sake who afterwards fell at Tallikota) aganist Kurnool, then part of the Estate of Savai."

2. Brigg's-Ferishta Vol. II Page 544—549.

బీడరు, తెలింగానాలను బాలించెడు నవాబు లందఱును, విజయనగర రాజులతోఁ దఱచుగాఁ బోరాడుచుండిరి. మల్లభూపాలుఁడు పోరాడినది, యీకుతుబుల్ముల్కుతోడ నై యుండును. కావున సౌగంధికాపహారణకావ్యమందలి చరిత్రాంశములు సత్యవృత్తాంతములును సమకాలికాంధ్ర కావ్యములందు సహితము వర్ణింపఁబడిన చరిత్ర విషయములును, చరిత్రప్రసిద్ధములు నగుట మనము గ్రహింపఁగలిగితిమి. ఈద్విపదకావ్యపీఠికలోఁ గవి యతిశయోక్తుల నేమియు వ్రాయక జరిగిన చరిత్రాంశముల మనోహరముగ వర్ణించెను..

సౌగంధికప్రసవాపహరణమునందుఁ గవి వ్రాసిన రావెలవంశీయులైన దండనాయకుల యుదంతమె గాక, తద్వంశీయులైన మఱికొందఱు వీరాగ్రగణ్యుల చరిత్ర మనకుఁ దెలియవచ్చుచున్నది. వారిలో రావెల వెలికొండ వెంకటాద్రి యొకఁడు. ఇతఁడు మట్ల అనంతభూపాలునిచే యుద్ధభూమిని సంహరింపఁబడెను.[1] తోపూరు యుద్ధములో తంజావూరి రఘునాథభూపాలునిచే నోడింపఁబడిన రావెల వెంకభూపాలుఁడొకఁడు.[2] ఇతనిపేరు సంస్కృత రఘునాథాభ్యుదయములో రావిళ్ల వెంకయనియుండఁగా విజయరాఘవనాయకుని యాంధ్రరఘునాథాభ్యుదయనాటకములో రావిళ్ల మాదన్న యని యున్నది.[3]

శాసనములందలి రావెలవారి వృత్తాంతము.

నెల్లూరిజిల్లా శాసనసంపుటములనుండి రావెలవారిచరిత్ర మనకుఁ దెలియవచ్చుచున్నది. రాజరాజదేవుని చంద్రదండపరిపాలనాసంవత్సర శాసనమునం దొక రావిళ్లనాయకుని ప్రస్తావన గలదు. ఇదియె రావిళ్లవారినిగూర్చి చెప్పెడి యత్యంతమైన ప్రాచీనశాసనమును, ప్రథమశాసనమునై యున్నది [4]

శాసనములలో వీరిని 'రావేల,' 'రావుల' 'రావెల' వా రని వ్రాయఁబడినది. వీరు నెల్లూరిజిల్లాలో నుదయగిరి, పొదిలి సీమలను, కొచ్చెర్ల కోటసీమను బాలించుచుండిన సామంతనాయకులు. వీరంద

1. Sources of Vijayanagar History P. 249.
2. Sources of Vijayanagar History P. 290.
3. Sources of Vijayanagar History P. 263.
4. Butterworth Venugopalachetti, Nellore Inscriptions. S. (6) (1257 A. D. ?)

కాగా

అను విజయనగరసామ్రాజ్యమును పెనుగొండనుండి పాలించిన, సదాశివరాయ, శ్రీరంగరాయ, వేంకటాద్రిరాయలకు సామంతులు. వీరిలో రావెల తిప్పానాయకుఁడు పొదిలిసీమను, రావెలకోనేటితిమ్మానాయకుఁడుదయగిరిసీమను పాలించిరి. ఔరంగజేబు పాదుషా రావిళ్ల తిమ్మానాయకుని కొచ్చెర్లకోటసీమపాలకుఁడుగ నియమించినట్లు కొచ్చెర్లకోటకైఫీయతులోఁ గలదట.* సౌగంధికప్రసవాపహరణ కావ్యమునందలి రావెలవంశీయులును శాసనములలోని రావెలవంశీయులును వెల్లుట్లగోత్రులె. వారికిని వీరికిని నెట్టిసంబంధము గలదో వంశవృక్షముల ననుసరించి చెప్పుటకు వీలుకడకున్నది. ఆశాసనములలోని రావెలవారి వంశవృక్షము లీక్రింద నుదాహరించుచున్నాను.

N. 124 (క్రీ. శ. 1582-83)

రావెల కంటినాయకుని
పౌత్రుఁడు
|
తిరుమలయ్య
|
చినతిమ్మానాయఁడు.
(ఉదయగిరిసీమపాలకుఁడు)

P. 19 (క్రీ. శ. 1563-64

రావెలతిప్పానాయునింగారి
పౌత్రుఁడు
|
(తి)ప్పానాయనింగారు
|
తిరుమలనాయనింగారు
(పొదిలిసీమపాలకుఁడు)

G. 112. (క్రీ. శ. 1617-18)

వెంగళప్పపౌత్రుఁడు
|
రావెల వెంకటప్ప
|
వెంగళప్ప

ఈపరస్పరసంబంధములను గూర్చి పరిశోధన సల్పిమఱియొకవ్యాసమును వ్రాసెదను.

---

* నెల్లూరిజిల్లా శాసనసంపుటములలో నీక్రిందిశాసనములను జూడుఁడు.
D. 35; G. 52; G. 84; N. 33; N. 124; G. 112; P. 19.

'సంస్కృతవాఙ్మయచరిత్ర' సమాలోచనము.

[ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులుగారు యం. ఏ.]

ఆంధ్రగీర్వాణభాషోపన్యాసకులు,
పిఠాపురరాజకళాశాల, కాకినాడ.

'సంస్కృతవాఙ్మయచరిత్ర'-ద్వితీయసంపుటము: లౌకికవాఙ్మయము.

కర్త ఆంధ్రవిశ్వకలాపరిషత్కళాశాలలోఁ బ్రధానపండితులగు బ్రహ్మశ్రీయుతులు మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు.

పుటలు 2 + 2 + 8 + 7 + 3 + 3 + 417, 419-457. [సరస్వతీపవర్ ప్రెస్ రాజమహేంద్రవరము.] వెల: రు. 2—4—0.

'ఆంధ్రవిశ్వకలాపరిషత్ప్రచురణములు'—13 సంఖ్య. వాల్తేరు. [1936.]

౧

ఈకృతి శాస్త్రిగారు రచించి, 1933లో నాంధ్రవిశ్వకలాపరిషత్సమాదరణమున సూర్యాలోకము నందించిన 'సంస్కృతివాఙ్మయచరిత్ర'-[ప్రథమసంపుటము: వైదికవాఙ్మయము] యొక్క రెండవసంపుటము. శ్రీశాస్త్రిగారు జగ మెఱఁగినబ్రాహ్మణులు, కవులు, పండితులు, నాటకకర్తలు, విమర్శకులు, ఆంధ్రభాషానుశాసకులు. ఆంధ్రగీర్వాణభాషావాఙ్మయములకుఁ జిరకాలమునుండీ యమూల్యసేవ యొనరించుచున్నారు. ఆంధ్రగ్రంథము లనేకములు రచియించుటయే కాక, సంస్కృతిరూపకములను, దశరూపకమును ననువదించియు సంస్కృతకవిచరితమును రచించియు గీర్వాణశారదారాధన మొనరించి, యిపుడు సంస్కృతసారస్వతేతిహాసమును సమగ్రముగ రచించి ధన్యులైరి. నాకుఁ జిరకాలముక్రిందటనే వీరిపరిచయస్నేహభాగ్యము లభించినది. వీరి వైదికవాఙ్మయచరిత్రతో నాకించుక సంబంధము గలదు. ఈలౌకికవాఙ్మయసంపుటముతోడను నా కించుక బాదరాయణసంబంధము గలదు. అందువలన దీనిని విమర్శించుట నాకు ముదావహము.

సంస్కృతసారస్వతసాగరమును గూలంకషముగ మథించి, లౌకిక సంస్కృతవాఙ్మయచరిత మను బృహద్గ్రంథరాజమును రచించి ప్రచురింప నున్న డాక్టర్-మాడభూషి. కృష్ణమాచార్యచరణులు [M.A., M.L., Ph. D., M. R.A.S.] దీని కాంగ్లమునఁ బ్రాక్కథనమును రచించిరి. రాజమహేంద్రవరమున న్యాయవాదులుగా నున్న శ్రీయుతులు వడ్డాది అప్పారావుగా రాంగ్లమున 'భూమిక'ను రచించియున్నారు. అందు [పు. vi] శార్ఙ్గధరుని 'పద్ధతి'ని బేర్కొనుచు 'శారఙ్గధరుఁడు'[Saranga-dhara] అని రెండుసారులు వ్రాసినారు. ఇది పొరపాటు. వేంకటాధ్వరికృత 'విశ్వగుణాదర్శము'ను (నీతికావ్య) సుభాషితగ్రంథములలోఁ జేర్చిరి. ఇది సరికాదు. విజయనగరమహారాజసంస్కృతకళాశాలాప్రధానాచార్యులగు శ్రీమత్పండిత పరవస్తు రామానుజస్వామిచరణులు [M. A.] దీనికాంధ్రమున నొకభూమికను రచించియున్నారు. ఇందు నాగానందాదిరూపకత్రయకర్తను 'శ్రీహర్షుఁడు' అనిపేర్కొనియున్నారు. 'శ్రీహర్షో నిపుణః కవిః' అని యాతఁడు దననాటకములఁ జెప్పుకొనినను నీతనిని హర్షవర్ధనుఁ డనియు, నైషధకారుని శ్రీహర్షుఁడనియుఁ బేర్కొనుట యుచితము.

ఈచరిత్రమును రచించుట కుపకరించిన గ్రంథనామముల పట్టిక యొసఁగఁబడెను. ఒకగ్రంథమునకే యనేకము లగుప్రతు లుండును. అందుచేఁ దా మేప్రతి నుపయోగించిరో యది యేసంవత్సరమున ముద్రితమో వీరు సూచించి యుండవలసినది. ఈలోపము పురాతత్త్వాన్వేషకులకు విశేషప్రతిబంధకముగా నుండును. ఈగ్రంథపట్టిక సమగ్రముగా నుండవలసినది. అల్పజ్ఞలుకూడఁ జేయనితప్పు లొండురెం డిందు దొరలి నవ్వుపుట్టించుచున్నవి.

1. 'Catalogues Calalogorum' (P. xviii.) ఇది 'Catalogus Catalogorum' అని యుండవలెను.

2. విల్సన్ పండితుని 'Hindu Thoador' ఇట Hindu Theatre' అనవలెను.

3. చింతాహరణచక్రవర్తి 'భారతీయేతిహాసత్రైమాసికపత్రికలు'. ఇది 'డాక్టర్ నరేంద్రనాథలా' పండితుని సంపాదకత్వమున వెలువడు 'ఇండియన్ హిస్టారికల్ క్వార్టర్లీ' (Indian Historical Quarterly) అనుటకు వచ్చినతిప్పలు. ఈపత్రికను శాస్త్రిగారు చూచియైన నుండలేదని దీనివలనఁ దేలుచున్నది. ఈపత్రికలోఁ బ్రకటింపఁబడిన చింతాహరణచక్రవర్తిపండితుని 'సంస్కృతదూతకావ్యచరిత్రము'ను నే ననువదించి యాంధ్రసాహిత్యపరిషత్పత్రికలోఁ జిరకాలముక్రిందటనే ప్రచురించి యున్నాను. మూలమును జూడక నాయనువాదమును మాత్రము వీరు సంగ్రహించి మూలముగల యాంగ్లపత్రికను చింతాహరణపండితుని కంటఁ గట్టిరి. ఇది చింత్యము.

ఈపట్టికయందు వీరు చేర్పవలసిన పరశ్శతగ్రంథములమాట యటుంచి, కాళిదాసుని కృతులలో వీ రొక్కమాళవికాగ్నిమిత్రమును మాత్రము చేర్చుట యెంతయు ననుచితము. కాళిదాసుని రఘువంశాదికావ్యరత్నములను, శాకుంతల- విక్రమోర్వశీయములను జేర్పకపోవుటకు హేతు వేమో తెలియకున్నది. వీని యన్నిటికంటెను 'మాళవిక' మిన్న యని వీరి యభిప్రాయ మేమో !

'ఎపిగ్రాఫియా ఇండికా' 'Cambridge History of India' అని వ్రాసినారు. ఈరెండు నొకటి యనియేనా వీరితలంపు! ఇఁక 'అకారాదిపదపట్టిక-(200పు.) దండిభామహులపౌర్వాపర్యమును 'పేథక్' నరసింహయ్యంగారు, కాణేపండితులు విమర్శించినట్లు వ్రాయఁబడెను. ఇట 'పాఠక్' [Dr. K. B. Pathak.] అని యుండఁదగును. ఈవిషయములు పట్టికను వ్రాసినవారి కచుంబితము లగుటచేఁ గావలయు నిందును 'పేథక్' అనియే వ్రాయఁబడెను. (ii) వాసవదత్త 246, 247 మొదలు పుటలలోఁ జేర్పఁబడినట్లు 'ఇండెక్సు'నఁ గలదు. ఇది సరికాదు. 246 పుటలోఁ జేర్పఁబడిన వాసవదత్త 'మహాభాష్య'కారునిచే నుదాహరింపఁబడుటచే సుబంధుని 'వాసవదత్త' కంటె భిన్నము, ప్రాక్కాలికము; అందుచే నది వేఱుగా సూచింపఁబడవలసినది.

- ౨ -

ఇంక నీసంపుటమునందలి తొమ్మిదియధ్యాయములయందలి విష యములను దిజ్మాత్రముగా సూచించి, శ్రీశాస్త్రులవారిచే నెడనెడ విడు వఁబడిన కొన్ని ముఖ్యవిషయముల ననుబంధించి, నా కందందు కలిగిన సందేహములను నభిప్రాయభేదములను జేర్చెదను.

I. ఈయధ్యాయమున ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధ ర్వవేదము, శిల్పవేదము అను నుపవేదములు వివరింపఁబడినవి. ఉపవే దములను గూర్చి కొన్ని సంవత్సరములక్రిందట నాంధ్రపత్త్రికాసంవత్స రాదిసంచికలో శ్రీయుతులు మానవల్లి రామకృష్ణకవి [యం. ఏ.,]గా రొక చక్కనివ్యాసమును బ్రచురించియున్నారు.

II. రామాయణమహాభారతములు. 'బెరిడేల్ కీత్' మొదలగు పాశ్చాత్యసంస్కృతపండితులు రామాయణమహాభారతములను బురా ణోపపురాణములను వైదికవాఙ్మయమునకుఁ జెందినవిగా నెంచి, తమ లౌకికసంస్కృతవాఙ్మయచరిత్రలలో వీనిని గూర్చి చర్చింపలేదు.

III. పురాణోపపురాణములు, తాంత్రికవిద్యలు. పురాణములం గూర్చి 'పార్జిటర్' [Pargiter] అను పాశ్చాత్యసంస్కృతపండితుఁ డును, విశాఖపట్టణవాస్తవ్యులును, స్వర్గత మహామహోపాధ్యాయు లు-శ్రీమత్పరవస్తు వేంకటరంగాచార్యార్యవరగురుపౌత్త్రులు నగు శ్రీపర వస్తు లక్ష్మీనరసింహస్వామిపాదులును గడోరవ్యవసాయ మొనరించి,చక్క నివిమర్శల వెలయించిరి.

IV. వివిధదర్శనములు. షడ్దర్శనములంగూర్చిన 'మ్యాక్సుమూ లర్' [Max Muller] అను జర్మనీదేశసంస్కృతపండితుఁడు రచించిన బృహద్గ్రంథరాజము లోకవిదితమే. వివిధదర్శనములం గూర్చి ప్రత్యేక ముగా 'కీత్' మొదలగు పండితులు కొన్నిగ్రంథముల రచించిరి. కీ. శే. కొమర్రాజు లక్ష్మణరావుగారు, [యం. ఏ.,] శ్రీమాన్ మేడేపల్లి వేంక టరమణాచార్యపాదులు మొదలగువారు తెలుఁగున న్యాయవైశేషిక దర్శనములం గూర్చి విమర్శగ్రంథములఁ బ్రకటించిరి. విశిష్టాద్వైతాచా ర్యులుఁ బరకృతగ్రంథకర్తలునగు శ్రీమద్వేదాంతదేశికచరణులు నిర్మించిన

'పరమతభంగము' నిట స్మరింపఁదగును. 24 అధికారములలో వివిధ మతదర్శనములను పీసుఖాడించి విశిష్టాద్వైతవేదాంతమును సయుక్తిక ముగ సిద్ధాంతీకరించియున్నారు. "మణిప్రవాళ" మను సంస్కృతద్రావిడ సమ్మిళితభాషలో రచింపఁబడిన యీకృతి సంస్కృతాంధ్రములలోని కను వదింపఁబడుట యత్యవసరము. శాస్త్రులవారిం దక్కడక్కడ స్వనిర్మితముల గు నాంధ్రపద్యముల నుదాహరించి యుండిరి. ఇవి యస్థానపతితములు గాఁ గానవచ్చును. ఇది సంస్కృతవాఙ్మయచరిత్ర కదా?

V. శాస్త్రములు: వ్యాకరణము, జ్యోతిశ్శాస్త్రము, సాముద్రి కము, అర్థశాస్త్రము, రాజనీతి, కామశాస్త్రము. వ్యాకరణశాస్త్రచరి త్రను 'బెల్వల్కర్' [Dr. S. K. Belvalkar, M. A., Ph. D.,] అను మహారాష్ట్రదేశీయసంస్కృతపండితుఁడు 'Systems of Sanskrit Grammar' అను గ్రంథమునఁ జక్కఁగ వ్రాసియున్నాఁడు. 'వాక్యార్థచంద్రిక' దండిభట్ల విశ్వనాథశాస్త్రి కృతమని, 'చిత్రప్రభ' భాగవతుల హరిశాస్త్రి కృతమనియు మల్లాదివారు. ఇదితప్పు; రెండును హరిశాస్త్రికృతములే! వ్యాకరణశాస్త్రమున నుద్గ్రంథములను రచించిన యీయాంధ్రదేశసంస్కృతపండితులను [146-7 పు.] శాస్త్రిగారు పేర్కొనియున్నారు. కాని 'గురుప్రసాదము' ను వ్యాకరణగ్రంథరాజమును రచియించిన మహామహోపాధ్యాయులు తాతా సుబ్బారాయశాస్త్రిచర ణులను బేర్కొనరైరి.

VI. అలఙ్కారశాస్త్రము: ఈశాస్త్రమును గొన్నికొన్ని లక్షణ ములనుబట్టి వివిధయుగములుగా విభజించియుండినచోఁ జరిత్రరచనకు విశేషముగా ననుకూలించి రసరీత్యలంకారధ్వన్యాది వివిధసిద్ధాంతముల తత్త్వము సుగ్రాహ్యముగా నుండెడిది. జర్మనీదేశసంస్కృతవిద్వాంసుఁ డగు 'జాకోబీ' [Dr. Jacobi] యీశాఖలోఁ బ్రత్యేకకృషి సల్పి యున్నాఁడు. పాశ్చాత్యదేశీయులలో 'నోబెల్' పండితుఁడును [Dr. J. Nobel] భారతీయపండితులలో 'పాండురంగ వామన కాణే' [యం. ఏ., యల్.యల్. యమ్.,] పండితుఁడును, ఆచార్య 'సుశీలకుమార డే'

[M. A., D. Litt.] యును, 'శంకరన్' పండితుఁడును [Dr. Sankaran, M. A., Ph. D.,] సంస్కృతసాహిత్యచరితము నాంగ్లమున రచించిరి. సాహిత్యశాస్త్రమునకుఁ గిరీటమువంటి భరతాచార్యుల నాట్యశాస్త్రమును- అభినవభారతితోఁ బరిష్కరించి ప్రచురించుచున్న శ్రీ మానవల్లి రామకృష్ణకవి, [యం. ఏ.,] గారి భగీరథప్రయత్నము నిట స్మరింపఁదగదా ?

(1) పుట 229:-భోజుని 'శృంగారప్రకాశము' లోనివిగా రెండు శ్లోకములు తెలియవచ్చిన వనియు నీగ్రంథము ముద్రితమైనట్లు కనఁబడదనియు వ్రాయఁబడియున్నది. ఇది సరికాదు. 36 ప్రకాశములు గల యీకృతి కొంతకాలముక్రిందట లభించినది. 26 వ ప్రకాశమును 25, 27, 29 వ ప్రకాశములలోఁ గొంతభాగము నుత్పన్నము లైనవి. దీనిం గూర్చిననాసమాలోచనమును మత్కృత 'సంస్కృతసారస్వతచింతామణి' [1 వ మరీచి] లోఁ గనఁదగును.

(2) అలంకారసర్వస్వము [పు. 233]: ఈకృతిని గుఱించియు, రుయ్యకునిగుఱించియు-మదీయ 'సంస్కృతసారస్వతచింతామణి' యందలి 3, 4 వ మరీచులం గనునది.

(3) ధర్మసూరి 'సాహిత్యరత్నాకరము'- [పు. 244] జయసంవత్సరాంధ్రపత్త్రిక-ఉగాదిసంచికలో శ్రీరంగము సోమేశ్వరశాస్త్రిగారి 'సాహిత్యరత్నాకరము' అనువ్యాసమును, మదీయ సం. సా. చింతామణిలో 'సాహిత్యరత్నాకరము-సారామందరములు' [5 వ మరీచి] అనువానిం గనఁదగును.

VII. కావ్యములు: పద్యకావ్యములు, చారిత్రికకావ్యములు, కథాకావ్యములు, పౌరాణికకావ్యములు, సందేశకావ్యములు, కల్పితకావ్యములు, నీతికావ్యములు, దైవతకావ్యములు, గద్యకావ్యములు, చంపూకావ్యములు నీయధ్యాయమున వివరింపఁబడినవి. గద్యకావ్యములను, చంపూకావ్యములను బ్రత్యేకాధ్యాయములలో నింతకంటె విపులముగా వివరించిన బాగుగానుండెడిని.

(1) [పు. 246]—వల్లభదేవునికృతి 'సుభాషితావళి'గాని 'సుభాషితరత్నావళి' గాదు.

(2) ,, సదుక్తికర్ణామృతకర్త 'శ్రీధరదాసుఁడు' గాని, 'రాజశేఖరుఁడు' గాదు.

(3) [పు. 251] 'కుంతేశ్వరదాత్యము'- కుంతలేశ్వరదౌత్య మనఁదగు. ఇది రఘువంశకారునిది గా దని శాస్త్రిగారు- ఇది సరిగాదు. దీనినిగూర్చిన నావ్యాసమును 'భారతి' (1930) లోఁ గనునది. ఋతుసంహారము గూడ నీతనిదే. [చూ. శ్రీఅరవిందఘోషుని Kalidasa's 'Seasons.']

(4) [పు. 253] 'మాఘుఁడు క్రీ. 550 ప్రాంతమువాఁడు'—ఇది సరికాదు. క్రీ. 700 ప్రాంతముల రచింపఁబడిన 'న్యాసము'ను పేర్కొనిన [II. 112] మాఘుఁడు, క్రీ. 800 ప్రాంతములకుఁ జెందినవామనునిచేఁ బేర్కొనఁబడెను. అందువలన మాఘుఁడు క్రీ. 750-800 లలో జీవించియుండె ననఁదగు.

(5) రామభద్రాంబ [పు. 232] సంస్కృతకవయిత్రులను గూర్చి యొక యధ్యాయము వ్రాయవలసినది.

వీరినిగూర్చి వెనుక నాంధ్రసాహిత్యపరిషత్సభలో నేనొక యుపన్యాస మిచ్చియున్నాఁడను. నాకు 50 మందికిఁ బైఁగాఁ గవయిత్రులు తెలియవచ్చినారు.

(6) [పు. 280] ధనంజయుని 'ద్విసంధానకావ్యము' ముద్రితము కాదఁట లభింపలేదఁట—ఇది సరిగాదు. ఇది చిరకాలము క్రిందటనే [క్రీ. 1895] వ్యాఖ్యతో నిర్ణయసాగరముద్రాలయమువారిచేఁ బ్రకటింపఁబడినది. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక [భావ] లో నేను ప్రచురించిన 'సంస్కృతద్వ్యర్థిత్ర్యర్థికావ్యచరితము'ను జూచునది.

(7) [పు. 282] వేంకటాధ్వరి—రాఘవయాదవీయము'—యాదవరాఘవీయ మని యుండఁదగును. ఇది 30 శ్లోకముల కావ్యము, కాని

‘మూఁడువందల శ్లోకములు’ కలది కాదు. ఇది వ్యాఖ్యతోఁ జిరకాలము క్రిందటనే తెనుఁగులిపిలో మైసూరులోఁ బ్రకటింపఁబడినది.

(8) [పు. 288] బాలభారతము—‘పన్నెండుసర్గలకావ్యము’- ఇందు 20 సర్గలు గలవు. దీనిని రచించిన యగస్త్యుఁడే ప్రతాపరుద్రీయ కర్త యగు విద్యానాథుఁడు. ఇతఁడు రచియించిన ‘నలకీర్తికౌముది’లోని 2 సర్గలు మాత్రము కొంతకాలముక్రిందట ఆం. సా. పరిషత్పత్త్రికలోఁ బ్రకటింపఁబడినవి. ఈకవిని గుఱించి, తత్కృతులను గాలమును గూర్చి నా‘అగస్త్యుఁడు—బాలభారతము’ అను లఘుగ్రంథమును జూచునది.

(9) [పు. 293-302] : సందేశకావ్యములు: ఇట శాస్త్రిగారు నావ్యాసములను సంగ్రహించి నాకు గౌరవ మొసంగినందులకు వారికి నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

(10) [పు. 305-6]: మహిమశతకము-వాంఛేశ్వరుఁడు:—ఈకవి కుట్టికవి యనునామమునఁ బ్రసిద్ధుఁడు. ఈకృతి వ్యాఖ్యతోఁ దెనుఁగు లిపిలో క్రీ. 1875 లో ముద్రింపఁబడినది.

(11) [పు. 312]: జల్హణుని ‘సూక్తిముక్తావళి’ ముద్రిత మని, శాస్త్రిగారు-ఇది నేటివఱకు ముద్రింపఁబడలేదు. ‘గైక్వార్ ప్రాచ్య గ్రంథావళి’ లోనిది ముద్రింపఁబడనున్నది.

(12) [పు. 315] కృష్ణకర్ణామృతము ‘త్రిశతక’ మనఁబడును గాని యిందు 112 శ్లోకము లున్నవి’-ఇది సరి గాదు. వావిళ్ల వారి ప్రతిలోను, బొంబాయిలోఁ బ్రకటింపఁబడిన యొకానొక నాగరీపుస్తకమునను- త్రిశతకమును గలదు.

(13) [పు. 320] ‘కపీనా మగళ ద్దర్పః-‘ఈశ్లోకము బాణుని దగునా కాదా యనువిషయము విచారణీయము.’ ఇది బాణునిదే; క్రీ. 12 వ శతాబ్దికిఁ జెందినశంకరపండితుఁడు (హర్షచరితవ్యాఖ్యాత) ఈ శ్లోకమునకు వ్యాఖ్య వ్రాసియున్నాఁడు. అందువలన వాసవదత్తాకారుఁడగు సుబంధుఁడు బాణునికంటె నవీనుఁ డనువాదము సరిగాదు. [చూ. కాణేపండితుని కాదంబరీపీఠిక-పు. xi-xiii; Indian Historical Quarterly-Vol. V. No. 4. P. 699-714.]

(14) [పు. 320] చంపూరామాయణకర్త 'ధారానగరాధీశుఁడగు భోజమహారాజని చిరకాలప్రసిద్ధి?' ఇది సందేహాస్పదము. ఈభోజుఁడు మాళవదేశాధీశుఁడు; చంపూరామాయణకర్త యన్ననో విదర్భాధిపతి యని యాగ్రంథమునసే కలదు.

(15) [పు. 328] భోజచంపూపూరక మగు రాజచూడామణి 'యుద్ధకాండ మముద్రితము'-ఇది కొన్నివత్సరములక్రిందట-కలకత్తాలోఁ బ్రకటింపఁబడుచున్న 'ఇండియన్ హిస్టారికల్ క్వార్టర్లీ'పత్రికలోఁబ్రచురింపఁబడినది. [Indian Historical Quarterly- Dec. 1930.]

(16) [పు. 329] వేంకటాధ్వరి 'ఉత్తరచంపువు'-ఇది యముద్రితమఁట! ఇది తెనుఁగులిపిలోను, బొంబాయిలోని 'గోపాలనారాయణ కంపెనీ' వారిచే నాగరిలోను గూడ నచ్చొత్తింపఁబడినది.

VIII. రూపకములు:-

(1) రామాభ్యుదయనాటకము యశోవర్మకృతము కాదేమో యని శాస్త్రిగారిసందేహము. వీరు పరిశీలించిన 'ధ్వన్యాలోకలోచనము' లోనే [పు. 148] యభినవగుప్తుఁడు-'రామాభ్యుదయే యశోవర్మణా'—అని వ్రాసియుండుటచే నీకృతి యశోవర్మకృత మని సిద్ధాంతీకరింపఁజనును.

(2) [పు. 368] కుందమాలను '1923 లో, శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు సంపాదించిన లిఖితపుస్తకమును బట్టి శ్రీ జయచంద్ర శాస్త్రిగారు లాహోరునగరమున ముద్రించిరి.'ఇదితప్పు. దీనిని మొట్టమొదట రామకృష్ణకవిగారే 'దక్షిణభారతీ గ్రంథమాల'లోఁ బ్రచురించిరి. దానిని బట్టియే తాము మరల ముద్రించుచున్నట్లు జయచంద్రశాస్త్రిగారు వ్రాసికొనియున్నారు. ఆంధ్రులకు రావలసినకీర్తి నాంధ్రేతరుల కంటఁగట్టుట శోచనీయము.

(3) [పు. 375] అనర్ఘరాఘవము-మురారి: రత్నాకరుని 'హరవిజయము' నందలి 'అఙ్కేఽథనాటక' అను శ్లోకములోని- అంక, నాటక, కవి మురారి- పదములప్రకృతముగా మురారిని దెల్పుచుండుటచే, రత్నాకరునికంటెఁ బూర్వుఁడైన మురారి క్రీ. 790-840 నడుమ

నున్నవాఁడను ప్రాచీనవాదమునే శాస్త్రిగారు పేర్కొనియున్నారు. ఉత్తమనాయకుఁడగు రామునివధ 'అనర్ఘరాఘవము'న లేదు. కావున నీశ్లోక మీనాటకమును నప్రకృతార్థముగా మురారిని సూచించుట లేదు. "కవిః కునాటకే అస్మిన్ ఉత్తమనాయకస్య నాశ మివ మురారి రిత్థం యస్య నాశం వ్యధిత సః ఆక్రాన్తకృత్స్నభువనః దైత్యనాథః హిరణ్యకశిపుః సహబన్ధువర్గైః క్వగతః"—అని పైశ్లోకము నొకానొక ప్రాచ్యవిద్యావిచక్షణు లన్వయించిరి. మురారికాలనిర్ణయమునకుఁ బ్రమాణాంతరము గలదు:-'అనర్ఘరాఘవము' లోని [I. 58]. 'యదిన్దో రన్వేతి'- అను శ్లోకము క్రీ. 900 ప్రాంతమువాఁడగు రాజశేఖరుని 'కావ్యమీమాంస' లోఁ [xvi అధ్యా.] గానవచ్చుచున్నది. కావున నీతనికంటె మురారి ప్రాచీనుఁడని చెప్పఁదగును.['మురారిమహాకవి'-(1936)-అను నాగ్రంథమును జూచునది.]

(4) [పు. 380]'భీమటకవి యైదునాటకములు నిర్మించెను.' ఈకవి 'ప్రతిభాచాణక్యము'ను గూర్చి సమదర్శిని యుగాదిసంచికలో నే నొక వ్యాసమును బ్రచురించియున్నాను. [1931-32 సం. ప్రజోత్పత్తిసంచిక, 98-99 పు.]

(5) [పు. 383] ప్రసన్నరాఘవము: జయదేవుఁడు-'12 వ శతాబ్దిలోని వాఁడని కొందఱందురు. ఈయుత్తమనాటకములోని శ్లోక మొకటియు విశ్వనాథకవిరాజు సాహిత్యదర్పణమున లేకపోవుటచే నతని కితఁడు పరుఁడని కొందఱందురు' ఇది సరి కాదు. 'కదళీ కదళీ కరభః' అను ప్రసన్నరాఘవమునందలి శ్లోకము సాహిత్యదర్పణమున [IV పరి.] నుదాహరింపఁబడి యున్నది. అందువలన క్రీ. 1300-1350 నడుమనున్న విశ్వనాథకవిరాజుకంటె జయదేవుఁడు ప్రాచీనుఁడు. మఱియు—రసార్ణవసుధాకరమున సింగభూపాలుఁడు (క్రీ. 1330) ప్రసన్నరాఘవమును రెండుసారు లుదాహరించుకొనియెను. అందువలన జయదేవుఁడు క్రీ. 1300 కంటెఁ బ్రాక్తనుఁ డనఁదగును.

(6) [పు. 389] విశ్వనాథుని 'సౌగంధికాపహరణ' మముద్రిత మఁట! ఇది నిర్ణయసాగరముద్రాలయమున నేఁటికి 35 సంవత్సరముల క్రిందటనే [1902 లో] ముద్రింపఁబడెను.

(7) [పు. 390] కుమారదాసుని 'జానకీహరణము' కావ్యము గావున, నాటకప్రకరణమున దీనిప్రసక్తి యప్రస్తుతప్రశంస.

(8) [పు. 391] 'ప్రవరకవి కాదంబరీరామ మనునాటకమును నిర్మించెను.'-ఇది సరికాదు. 'అకాలజలద' ఇత్యాదిశ్లోకమునకు-* అకాల జలదుని శ్లోకములను దనవిగాఁ జూపి, కాదంబరీరాముఁడు నాటకరచన మునఁ గవిప్రవరుఁ డని పేరొందెననికదా తాత్పర్యము. దీనికి శాస్త్రిగా రపార్థము చేసిరి.

IX. నిఘంటువులు-ఛందశ్శాస్త్రము.

నిఘంటుచరితమును జర్మన్ భాషలో 'జకారియా' యను పాశ్చాత్యపండితుఁడు రచించెను. పిమ్మట కీ. శే. మ. మ. రామావతారశర్మ గారు కల్పద్రుకోశమునకుఁ బీఠికారూపమున నిఘంటుచరితము నాంగ్లమున రచియించిరి. దీని ననుసరించి శ్రీమేడేపల్లి వేంకటరమణాచార్యుల వారు తెలుఁగునఁ దచ్చరితమును రచించి, 3 వత్సరములక్రిందట- ఆంధ్ర సాహిత్యపరిషత్ పత్రికలోఁ బ్రచురించిరి.

(1) [పు. 413] 'మ. మ. రంగాచార్యులవా రొకగొప్పనిఘంటువును నిర్మింప నారంభించిరి గాని, యది నెఱవేఱినది కాదు.' ఈనిఘంటురచనము పూర్తియైన దనవచ్చును. కాని, 'అ, ఆ' లతోఁ బ్రారంభించు పదములకు రెండుసంపుటములు తెనుఁగులిపిలోఁ జిరకాలముక్రిందటనే ప్రకటింపఁబడినవి. ఇది వాచస్పత్యమువలెనే విజ్ఞానసర్వస్వము. [Encyclopaedia.]

(2) [పు. 415] వృత్తరత్నాకరకర్త యగుకేదారభట్టు 'దేశకాలములు దెలియకున్నవి'- చండూపండితుఁడు (క్రీ. 1297) నైషధవ్యా

---

*శ్లో. 'అకాలజలదశ్లోకై శ్చిత్ర మాత్మకృతైరివ
జాతః కాదమ్బరీరామో నాటకే ప్రవరః కవిః.'

ఖ్యానమున- నృత్తరత్నాకరము నుదాహరించుకొనుటచే నీతనికంటెఁ గేదారభట్టు ప్రాచీనుఁ డనఁదగును.

- 3 -

సంస్కృతవాణి యుత్కృష్టపాశ్చాత్యభాషలకంటె మిన్నయని పాశ్చాత్యసంస్కృతపండితులు ముక్తకంఠమునఁ బ్రశంసించియున్నారు. 'సర్ విలియమ్ జోన్సు' [Sir William Jones] వాక్యమును జూడఁదగు: 'The Sanskrit language, whatever be its antiquity, is of a wonderful structure, more perfect than Greek, more copious than Latin, and more exquisitely refined than either.' సామాన్యముగా నిం దే శాఖను జూచినను నపారత్వము, నగాధత్వమును బొడకట్టుచుండును. అట్టివాఙ్మయచరిత్రను వ్రాయఁబూనుట సముద్రమున కేతా మెత్తుట వంటిదే. సంస్కృతవాఙ్మయవిచారకములగు గ్రంథములు 'జర్మన్, ఆంగ్లము, ఫ్రెంచ్' మొదలగుపాశ్చాత్యభాషలలోను, హిందీ మొదలగు భారతీయభాషలలోను బరశ్శతములుగా రచింపఁబడినవి. అందువలన నాయాశాఖలలోఁ బ్రత్యేకముగాఁ గఠోరవ్యవసాయ మొనరించి, యాధునికగవేషణావిధానమున నారితేరినపండితులచే సాహిత్యపరిషత్తులు గాని, విశ్వకళాపరిషత్తులు గాని రచియింపఁదగును. 'కేంబ్రిడ్జి' విశ్వవిద్యాలయమువా రాయాభాగములఁ బ్రత్యేకకృషి సల్పినవారిచే నాంగ్లవాఙ్మయచరిత్రమునం దాయాభాగముల రచియింపఁజేసిరి. ఈపద్ధతిని రచియింపఁబడిన కృతియందు రచనాశయ్యాదులం దేకత్వము లేకపోవుట, పూర్వాపరవైషమ్యము, పునరుక్తి మొదలగులోపము లుండవచ్చును. కాని ప్రధానసంపాదకుఁ డట్టిలోపముల సాధ్యమైనంతవఱకుఁ దొలఁగించును. ఏభాగమును జూచినను సమగ్రత, ప్రామాణ్యము నుండును.

పాశ్చాత్యపండితుల సంస్కృతవాఙ్మయసేవ, మహమ్మదీయ సంస్కృతపండితులసేవయు వివరింపఁదగును. ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారి

ప్రచురణ మగుటచే నాంధ్రులు గీర్వాణవాణికిఁ జేసినపరిచర్యను విపులముగ నొకప్రకరణమున వివరింపవలసినది. ఆంధ్రుల సంస్కృతసేవ యేమండలమువారిసేవకును వెనుకఁ బడదు. ఏశాఖయందుఁ జూచినను వీ రఖండసేవ యొనరించియున్నారు. వీరినిగుఱించి ప్రత్యేకముగా వ్రాయుచో నీసంపుటమంతగ్రంథ మగును.

భారతవర్షమున సంస్కృతపత్త్రికారాజము లనేకములు విలసిల్లి సురభారతీప్రచారమునకు విశేషముగాఁ దోడ్పడినవి. 'భిన్నరుచేర్జనస్య బహుధా ప్యేకం సమారాధన' మ్మను న్యాయమున నీపత్త్రికలు విచిత్రరుచులుగల సంస్కృతసారస్వతరసికుల సాహిత్యపిపాసను రగులుకొల్పి సంస్కృతవాఙ్మయాభ్యుదయమున కెంతయు నుపకరించినవి. అందుచే 'సంస్కృతపత్త్రికావాఙ్మయచరిత్ర'ను శాస్త్రీగా రొక ప్రకరణమునఁ బ్రత్యేకముగా వివరింపవలసినది. నేఁటివఱకుఁ దెలియవచ్చిన సంస్కృతపత్త్రికల నామముల నిట నొసఁగెదను-

1. అమృతభారతి [కొచ్చిన్]. 2. ఆర్యప్రభ [Vedavel Tora, Manbhum Dt.] 3. ఉద్యానపత్త్రిక [తిరువాడి]. 4. ఉద్యోతము [సం. సా. పరిషత్తు-పంజాబు]. 5. కావ్యమాల [బొంబాయి]. 6. గ్రంథరత్నమాల [బొంబాయి.]. 7. పండితపత్రిక ['The Pandit'-Benares]. 8. బ్రాహ్మణమహాసమ్మేళనపత్రిక [కాశీ]. 9. మంజుభాషిణి [కాంచీపురము]. 10. మంజూష [కలకత్తా]. 11. మధురవాణి [బెల్గామ్]. 12. మిత్రగోష్ఠి [కలకత్తా]. 13. మీమాంసాప్రకాశము. [పూనా]. 14. మైసూరుమహారాజసంస్కృతకళాశాలాపత్రిక. 15. విజ్ఞానచింతామణి. [పట్టాంబి]. 16. విద్యావైజయంతి [కాశి]. 17. విద్యోదయము. 18. శారద [ప్రయాగ]. 19. శ్రీశారద [మైసూరు]. 20. 'శ్రీ'పత్రిక [కాశ్మీరము]. 21. సంస్కృతకళాశాలాపత్రిక [కలకత్తా]. 22. సంస్కృతచంద్రిక [కొల్హాపురము]. 23. సంస్కృతపద్యవాణి [కలకత్తా]. 24. సంస్కృతభారతి [బర్ద్వాన్]

25. సంస్కృతమహామండలపత్రిక [కలకత్తా]. 26. సంస్కృతరత్నాకరము [జయపురము]. 27. సంస్కృతవాదిని. 28. సంస్కృతసాహిత్యపరిషత్తు [కలకత్తా]. 29. సం. సా. పరిషత్పత్రిక [శ్రీనగరము]. 30. సహృదయ [శ్రీరంగము]. 31. సుప్రభాతము [కాశి]. 32. సురభారతి [కాశి]. 33. సూర్యోదయము [కాశి].

భారతవర్షమునందలి ప్రభువు లనేకులు సంస్కృతపండితులను, కవులను బోషించుటయేకాక తామును విద్వాంసులును గవులు నయి యనేకగ్రంథరాజముల రచించియున్నారు. భోజుఁడు, అవంతివర్మ, యశోవర్మ, అర్జునవర్మ, లక్ష్మణసేనుఁడు, కృష్ణదేవరాయలు మొదలగురాజకవులనుగూర్చి ప్రత్యేకముగా వ్రాయఁదగును. కాశీ, కలకత్తా, లాహూరు, బరోడా, పూనా, మైసూరు, మద్రాసు, తిరువాన్కూరు మొదలగుస్థలముల ననేకగ్రంథమాలలు బయలువెడలి యపూర్వసంస్కృతగ్రంథరత్నములఁ బ్రకాశింపఁజేసినవి. వీనిచరిత్ర, యించుక వ్రాయుట వాంఛనీయము. 'ఓరియంటల్ బుక్ ఏజన్సీ' (పూనా) నిర్ణయసాగరసంఘము (బొంబాయి) మోతీలాల్ బనార్సీదాస్ (లాహూరు), మెహర్ చంద్ లక్ష్మణదాస్ (లాహోరు) మొదలగు ప్రాచ్యగ్రంథవిక్రేతలు, ప్రకాశకులు సురభారతి కఖండసేవ యొనరించిరి. కావున వీరిని మఱువఁజనదు. శాస్త్రిచర్యు లచిరకాలమున- ద్వితీయసంస్కరణమున- నీలోపములఁ దొలఁగింతురుగాక !

జవ్వనము-యవ్వనము.

కిళాంబి రాఘవాచార్యులుగారు, ఎం. ఏ., బి. ఎల్., కాకినాడ.

బాలకవిశరణ్యమున (పుట 32) జవ్వనమునకు యవ్వనము రూపాంతర మనియు నందులకు మహాకవిప్రయోగములు గల వనియుఁ, బరిష్కరణంబుల నవి మార్పఁబడిన వనియు శ్రీ గిడుగు రామమూర్తిపంతులవారు వ్రాసియున్నారు. శ్రీనాథుఁడు శివరాత్రిమాహాత్మ్యమున యవ్వనపదమునే వాడియుండఁ బరిష్కర్తలు దాని యౌవన మని మార్చి రని వీరి వాదము. శివరాత్రిమాహాత్మ్యమున కొకటియే ప్రతి గలదు. (పరిషద్భాండాగార సంఖ్య 3105) ఈగ్రంథమున శ్రీనాథుఁడు యౌవనజవ్వనపదముల వాడిన స్థలములను యథామాతృకముగా నిందుఁ జూపితిని.

ముద్రితప్రతి.	తాళపత్రప్రతి.
(1) 2.17 శరలతాకాననమువోలె జవ్వనంబు—	జవ్వనంబ్బు
(2) 2-83 జవ్వనం బావిర్భవించిన—	జవ్వనం బావిర్భవించిన
(3) 2 86 ఆడిగర్భేశ్వరత్వంబు యౌవనంబు—	యవ్వనంబ్బు
(4) 2. 88 యౌవనారంభంబున—	యవ్వనారంభంబ్బునా
(5) 2-93 యౌవనము దోషములకెల్ల నాస్పదంబు—	యావ్వనము దోషముల...
(6) 2-95 నాడిగర్భేశ్వరత్వంబు యౌవనంబు—	యావ్వనంబ్బు
(7) 2-105 జవ్వనమునను—	జవ్వనములు
(8) 2-109 నవయౌవనాంకురోన్నత—	నవయవ్వనాంకురా...
(9) 3-17 యౌవనసంప్రాప్తి—	యవ్వనసంప్రాప్తి
(10) 3-34 చారుయౌవన—	చారురొువ్వన

ఇందు 1,2,7 స్థలముల జవ్వన మనియే గలదు. 3,6 స్థలముల 'ఆడిగర్భేశ్వరత్వంబు యౌవనంబు' అను దానికే రెుొకచో యవ్వనంబ్బు అనియు, మఱొకచో యావ్వనంబ్బు అనియుఁ గలదు గదా. ఇందు

మూల మేమై యుండును. 2-93 వ పద్యమున 'యౌవ్వనము' అనివ్రా సిన వ్రాయసకాని వ్రాఁతల ప్రామాణ్య మే మనవచ్చును.

ఆ. 3-17 పద్యమును జూడుడు.

క. దేవరప్రతినిధిఁగా సం
సేవింతుము యజ్ఞదత్తు సిద్ధము యతనిన్
భావింతుము దత్తనయుని
యౌవనసంప్రాప్తి లేనియటము న్నెల్లన్.

ఇందు ప్రాసస్థానమున యౌవనశబ్దము గలదు. తాటియాకు ప్రతియందు 'యవ్వనసంప్రాప్తి' యని కలదు. శ్రీనాథుఁడు దేవర, సేవింతుము, భావింతుము అనువానితో యవ్వన మని ప్రాసస్థానమున వ్రాసి యుండునా? అట్టిప్రాసము కవిసమ్మతమా? లాక్షణికమా? పద్యపు రాణమున, ప్రాసస్థానమున యవ్వన ముండుటచే 'యవ్వనము' కవిప్ర యుక్త మని వాదించు శ్రీపంతులవారు ప్రాసస్థానమునఁ గల పదము యౌవనమై యుండును గాని యవ్వనమై యుండ దని యంగీకరింపక తప్పదు. ఆ 2-109 నవయౌవనాంకురోన్నతపద మైన యనుచో సం స్కృతసమాసమున యవ్వనశబ్దమును శ్రీనాథుఁ డుపయోగించె నన వచ్చునా? వ్రాఁతలో యౌవన మని వ్రాయుటకు మాఱుగ యవ్వన మని వ్రాసియుండుట స్పష్టముగదా? ఆ 3-34 చారుయౌవనరూప సంపన్నరై యనుచో యొవ్వన మనియే మూలమునఁ గలదు. దీని వలనఁ గూడ శ్రీనాథునిప్రయోగ మేమై యుండునో యూహింపఁ దగును. ఒకపదమునకే యిన్నివిధముల వ్రాఁతలఁ గల్పించినవ్రాయస కాని వ్రాఁతల కేమనవచ్చును? వానిప్రామాణ్యమును గ్రహింపఁదలఁ చినచో శబ్దస్వరూప మే మగును? యౌవనశబ్దము ప్రాకృతమున జొవ్వణ మగు నని మన మంగీకరించి జవ్వన మనుదానికియవ్వనము రూపాంతర మని యనుకొన్నను శ్రీనాథునిప్రయోగమువిషయమై సందేహ ముండుటకు వీలులే దని గ్రహింపవగును. మఱియొకయూహ- యౌవ నము పలుకుబడిలో 'యవ్వన'మగు నని సుస్పష్టము. అందువలన నిట్టి

ప్రమాదము వ్రాఁతలో సహజము. ఈసందర్భముల విజ్ఞులూహిం
యగాక.

సింగన పద్మపురాణమునఁ బ్రాసస్థానమున యవ్వన మని ప్రయో
గించె నని వీరు వ్రాసియున్నారు. ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునఁ బద్మపుర
మునకు మూఁడుప్రతులు గలవు. (గ్రంథసంఖ్య 115, 1106, 205
బాలకవిశరణ్యమున (పుట 322) నీయఁబడినపాఠ మిది.

క. అవ్వనములు దమమయమై, యవ్వనము ......క్రొవ్వి...
దీనికి 1106 సంఖ్యగల ప్రతియందు

క. యవ్వనముల దమమయమై
అవ్వనముల నొకటి యొకటి నరుము మిగులన్.

అనియు, 115, 2057 సంఖ్యగల ప్రతులయందు

క. యవ్వనములు మృగమయమై
నవ్వనమున నొకటికొకటి నరుమును మిగులన్
క్రొవ్వి కడు మసరుకవిసిన
నవ్విపినంబుల మృగంబు లవనీనాథా!

ఈపాఠములు సరియగు నర్థము నొసఁగుటలేదు. సింగన ప్రా
స్థానమునఁ 'యవ్వన' మని జవ్వనశబ్దమునకు రూపాంతరముగ ప్ర
నను, శ్రీనాథుని శివరాత్రిమాహాత్మ్యమునఁ గలపాఠములను బట్టి, యవ్వ
మని శ్రీనాథుఁడు వాడియుండెననుట పొసఁగదు.

రెండు శృంగారనైషధ ప్రయోగములు.

క్రిందటి సంచికలో శృంగారనైషధపు వ్రాఁతప్రతులయందు 'జేతు రనిన, (2-88) 'విసీవిననిభంగి' (6-33) యను పాఠములు గానవచ్చుట లేదని తెలియఁ బఱచితిమి. పరిషద్భాండాగారమునఁ గల యితరతాళపత్ర ప్రతులయందుఁ గూడ నట్టిపాఠములు గనఁబడుటలేదు. (గ్రంథసంఖ్య 1230, 2018, 2508, 2869). మోహింపజేయునతని, వినిఁవననిభంగిన యని యన్నిటియందును గలదు. ఇన్నిప్రతులలో సమానముగ నేమార్పును లేక కన్పడుచుండుటచే నవియే సరియగుపాఠము లని మనము నిర్ధారణ మొనర్పవలసియున్నది. అర్థముకూడ సుస్పష్టము. హంసతూలికాతల్పంబునందు మేను సేర్చినప్పుడు నేత్రరాజీవయుగము జేరి చుంబించి యతని మోహింపఁజేయు, నిద్రయు నీవు నేమాడ్కిరో. కొన్ని వ్రాఁతప్రతుల 'చుంబించు' అని కలదు. దానికన్న 'చుంబించి' యను నదియే సరియగుపాఠ మనుకొందును. 'మోహింపఁజేయుదు రన' యను నట్టియర్థమునే యిచ్చినను, తాళపత్రప్రతులఁ గన్పడదు. వినిఁవ నిభంగి యని శ్రీనాథుఁడు ప్రయోగించె నని మనకు వివిధప్రతులవలన స్పష్టము. కాని వినిఁ యనుచో యుకారలోపము లాక్షణికసమ్మతము కాదు. బచ్చుకు ఇత్యాదులవలెఁ గవిసమ్మత మనవలెను. వినియుఁ అని వ్రాయుటకు మాఱు వినిఁ అనియే ప్రయోగించె ననవలసియున్నది.

శైలివిలాసిని.

— కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారు, కాకినాడ. —

ఇటీవలి కలికాలకవితారంగస్థలిని, నవీనశైలీనీలాలక యొకర్తుక తననర్తనవిలాసములచే, లోకమును మోసగింప మొదలిడినది. ఈకుటిల కుంతలావిలాసలీలాతళుకుకురసభంగములు, సాగరతరంగమాలికాడోలి కలవలె నిలుకడలేక పలుతెఱంగులఁ బరుగిడుచున్నవి.

గ్రాంథికారణ్యప్రాంతోటజనివాససూరులును, క్రొందెలుంగుగూడెంపుగుడిసెల విహరించు సంస్కారధూర్వహులును గూడ, నీశైలీచేడీ విలోలలీలలఁ బ్రకటింపఁ బాటుపడుచున్నారు, కాని, యీచంచలవంచకు రాలు స్వీయశైలీలీలల వెలుపలి పదవిన్యాసములందే కాక, వుత్తేజకము లగునాంతరంగికభావతరంగవీచికావాతూలపరంపరలయందు కూడఁ బ్రదర్శించుచుండుటచే భాషాద్వయసామ్రాట్టులకు సహితము పట్టువడక, స్వటక్కరితనముచే వారల కులుకెత్తింపఁజూచుచున్నది.

ఓ! కళాసామ్రాజ్యతేఁడులారా! కంటిరా! ఈకలువకంటి కొంటితనంపుచేఁతల! అబలయగుశైలీనర్తకి కళాప్రౌఢ లగుమునిపీతల్లజుల గోస్త్ర కాంత మేలు సింహము లన్నట్లు, ట్రబుల్సు (troubles) పాల్సేయుచున్నదిరో! అబ్బా! ఏమి! ఈవండర్ (wonder) ఇది సోదామినీకామినీనీరజాక్షికిఁగూడఁ బట్టువడ సాధ్యముకాని ట్రిక్సు (tricks) చూపుచున్నది. విక్యన్నటిని లాంగెస్టు (longest) యనుపపోష్టుయగ్రంపైకి దింపవచ్చును, కాని, యీశైలీశైవలినీనీలవేణిని విలువఁ బెట్టుటకు మాత్రము పాత్తు (path) చూపట్టకున్నది. నేనీమధ్య యీన్యూ (new) శైలీసారంగినీసంగతుల వాచి (watch) చేయఁ దలంచి, సాహిత్యారణ్యపొలిమేరలోని కేఁగి, వనమంతయు గాలించితిని గాని,

---

ఈనడుమఁ గ్రొత్తగాఁ బ్రకటితము లగుచున్న సాహిత్యసారస్వతశైలీసంపదలఁ దిలకించుటచే నాకుఁ జేకూరిన విజ్ఞానానందములవెల్లడించుటకీవ్యాసము వ్రాయఁబడినది.

ఈశైలీలేడి తన కోటదిమో పొడకట్టదాయె. అంతట నేనలసటచే డస్సి ఒకదట్ట మగుపత్రజొంపములతో నలరారు సురపొన్నట్రీ (tree) నీడను, ఒకస్టోను (stone) పైఁ గూర్చుండి యిట్లు థింకింప (think) ప్రారంభించితిని. "శైలియన పదవిన్యాసమా? లేక, యర్థంపుముద్దయా? అదికాక, భావసౌభాగ్యగరిమయా? ఆర్, (or) ధ్వనిసంపదయా? ఇ వెవ్వియూ గాక స్టయిలు (style) రీతియా? లేక మాటల బ్యూటిఫుల్ నెస్సా? (beautifulness) అని వి శ్లంత కొట్టుకొన్ననూ, దీని తస్సాదీయ అసలుసత్తా మాత్రము దొరికినది కాదు. ఇటులుండ, కొంతవడి కానసీస్టోనుగుట్టలలోనుండి తరూపాతాపా గభీరధ్వానమువలె రోదోకుహరరూపగర్భకోశములఁ బూరించుచు నొక పెంపడగు సౌండు (sound) కర్ణరంధ్రములలోఁ జొరఁబడినది. తిరిగి యానాదకళ నుపాసి పఁజూతునుగదా! ఆజంఝానాధ్వాన మంతర్థాన మాయెను.

నిజమే! శైలిబ్యూటీ యిట్లుండవలె నని నిర్ణయించుట గొప్ప డిఫెక్టు (d·fect) వై యుండు రా? దానిసౌందర్యము యొక్క పసం .. ను నిరూపించు రోడ్డు లేనే లేదు. అందుమూలముచే నాచార్యబిరుదాంకితులకుఁ గూడ, దీనినిజరూపము నుపాసించు వే (way) దొరకకున్నది. ఈక్రిందివానియందు శైలీకళావిలాసముల నాదోపాసకవరసింహుల నిరూపింప నాహ్వానించుచున్నాను. కోపింపక, కామ్ముగా (calm) సంజాయిషీ నీయవలయు.

హంసతూలికల కోమలమార్దవమునకును, మదకుంభికుంభవిరాజమాన కేశజాలము మెత్తందనమునకును, శైలి యొక్క రీతి నుంట సాధ్యమా? కళాసౌందర్యమాధుర్యభాగ్యసారము నాస్వాదించు నాంగ్లాంధ్రకోవిదులకే యీవిభాగమున భ్రమపరంపరామేఘము లడ్డుతగులుచుండునే! యిక తక్కుంగల యార్డినరీ (ordinary) పండితులమాట చెప్పనేల.

ఐసుపీసుముక్క (ice piece) యొక్క చల్లఁదనమునకును మలయమందమారుతానిలశైత్యమునకును, నొక్కచక్కి శైలీవిభ్రమ ముందు

నా? చింకిచేటనాద మాధుర్యము ను మానసము చిగు రొత్తునట్లు వర్ణిం
ప నేర్పుగల కలము క్రొంత్రొంపెట్టునినదము నెట్లు ప్రస్తుతింపఁజాలును?
ఇది యింపాసబుల్ (impossible) కదా! పొట్టులోఁ దమున మెఱుగు
రీతికిని, నదీవెల్లువదరిని రెల్లుపెరుఁగుదారికిని కంబైండు శైలిచొప్పదునా?

మంజులతర కాకలీకంఠరవకలిత మగుకోకిలకూఁతలఁ జిత్రించు
కుంచీసంచారములఁ బ్రదర్శించు చిత్రకారుని మేధాశక్తిని జూపట్టు శైలికిని,
కాకోదరభీకర మగు కేకినీవాణీవిలాసమును లిఖించు కవివ్యాఘ్రుని లేఖ
నీతీరునకును, సామానాధికరణ్య మెట్లొడఁగూడును? ఈరెంటను వ్య
త్యాస ముండుట న్యాయమే కాని అన్నాచురల్ (unnatural) కాదు.
దీనిం గాదను సారస్వతకళాకోవిదు లుండరు. ఒకచో నుండిన నుండ
నిండు. వారివాదము లొట్టి చొప్పబెండు లగును కాని, రస్గుల్లాలు
కానేరవు.

స్నానసంధ్యాది మర్యాదాకలితుఁ డగుభక్తకవివరుని సరసలేఖనీ
పావనకవితాధార కుండుస్టయిలు, ఉభయభాగప్రక్షాలనాదూరుఁ డగు
నాంగ్లాచారకవిమార్తాండుని కవితకుఁ బట్టువకుట యెట్లో తింకుచేయుఁ
డు. పైప్రశ్నల కేమి గాని, తెలుంగుపూఁబోఁడి జట్టుముడికిని, కంబోడి
యాదూడిపిడికిని శైలిలోఁ దారతమ్యము లేదందురా ? లేక కలదందు
రా ? ఉన్నచో, వర్ణించి చూపుఁడు. చూతము మీకవితావెరైటీని
(variety).

బాగుగా, పండి మ్రాకునుండి క్రిందఁబడిన రెండు ఎండుటాకులు
కూడినచో ఘళఘళ నినదము చొప్పించునుగాని, ముద్దుమాటల కలయిక
యుంగవలె స్వీటుబ్యూటీ (sweet beauty) పొడకట్టదుకదా! పె
క్కువంక్తులు చిత్రింపనేల. జరామృతుల దూరమొనర్చి, సప్తధాతురస
ముల సొంపును పెంపుచేసి, మనసును సలసల మరగింపఁజేయఁజాలు
పియూష్యమరసనోనల పానముచేయుటచేఁ, గైపెక్కి, నందనసుందరమంది
రాంతమున బృందారబృందముల నడుమ పురందరుని ముందర మందహాస
సుందరవదనారవిందమునుండి పైకిలెగుచు భావకళాఫ్లేమ్సు (flames)

నిర్జరహృదయములకు హీఁటెక్కించు, (heat) కాళ్లయందలి చిరిగజ్జియలకింకిణీసౌండ్సు వియచ్చరజంపతీలతలకు నాశ్చర్యపల్లవముల తొడిగించు, రింగున నాట్యరంగమున దిగి నర్తనముచేయు- యుంగరముంగురయగు డివైను లేడీడ్యాన్సుకును, (divine lady dance) కడుపాఁకలిని పూఁటిగా మాన్పఁజాలని యరసోలెఁడు యవాగూ వాటరును గ్రోలి, శరీరసీరసముచే నూఁగాడుచు, తిండికై నకుసుగుంటలో దిగి, చిందులు ద్రొక్కు కూలియాలి వాలుకన్నుల భావకళాశైలికిని తారతమ్య ముండుట యొకవింతయా ?

కొంద ఱాంగ్లసారస్వతసాహిత్యసారపారావారమును దరించిన నవకోవిదులు మిల్టనుకవి మేటిపేరడైజులాస్టులో (Paradise Lost) చూపిన స్టయిలురమ్యతను, ఇప్పటియాంధ్రపొయిట్రీ (poetry)లోనికి దింపఁజూచుట యడియాసయే గాని, యుక్తయోగకారి కా దనుచున్నారు. మఱికొందఱు సాంస్క్రిట్టుస్కాలర్సు (Sanskrit scholars) కవిసార్వభౌముఁ డగు కాళిదాసవిబుధేంద్రుఁడు వర్ణించిన మబ్బుకబ్బములోని నాచురల్ సొబగును, నవయువకకవనములోనికి దిగలాగుట రొంబకష్ట మనుచున్నారు. వేఱుకొందఱు త్రిలింగులు తెనుంగుషేనకవితలోని నీటు వెరైటీని (neat variety) వంగపొయిట్రీలోనికిఁ దేఁజూచుట వృథాట్రబు లనుచున్నారు.

పరికింప, పరమాణువులు మొదలు మహాగొప్పమౌంటెనుపంక్తులవఱకును గలపదార్థం గుంపంతయు, శైలీవిలాసినీసౌభాగ్యకళాకాంతిసంపదతోఁ దనరారుచున్నది. ఈసృష్టిలో శైలి లేని నలుసుకూడఁ గన్పట్టదుకదా ! కావున శైలీవిలాసినీసొబగుభాగ్యము మైండుకుమాత్రము టచ్చగును (touch) గాని, మాటల కంట నేరదు. ఆంధ్రశైలీస్వీటువరబత్తులో యింగ్లీషుస్టయిలువైను పోసినఁ జక్కని కాంబినేషను (combination) సమకూరునేమో ! అడాడా ! ఏమి. ఈశైలీగడబిడ. వడగాలికి టెండరు (tender) పల్లవములవలె రసికజనమానసకుందములు కందిపోవుచున్నవే.

అన్నలారా ! ప్రకృతము నూత్నత్రైలింగ్య కవితాకన్యకామంగళకాయమానవితానమునకు శీలశ్రీకాంతికలితము లగు పదపారదగుళికాగుంఫనములు ముఖ్యములు కాని, కేవలశైలీశైవాలతోరణ డికరేషన్సు (decorations) ముఖ్యములు కావు. ఇది నాయూహ. ఆపైని యాజు యూలైక్కు. (as you like) కాని, చక్కగాపూరించిన సారాయివారిపూరంపుకుండలో సాలిగ్రామసంపుట ముంచినంతమాత్రాన దానికి తిరుతరవాణీసేరసారగౌరవము రానేర్చునే ? చప్పిడిచొప్పదంటుపదకదంబముల కావ్యంపుపేటీలలో స్టోరీకరించినంతనే, ఆయది బాలరసాలసాలకోమలనవ్యకావ్యకన్యకాపేశలమేలిమేనును, పులకింపఁజేయఁగలదా !

స్వాతంత్ర్యజంఝామారుతప్రేరితము లగునిర్లక్ష్యమబ్బులు చలరేఁగు యీహూణశకమున సాహిత్యనిబంధనబాధల సరకుసేయువారెవ్వరు ? ఎవరిశైలి వారిది. హిందూముస్లీముశైలులు వేరువేరుగా భారతావనియందు ప్రవహించుట లేదా ? అట్లనే గ్రాంథికగ్రామ్యస్టయిల్సు కూడ వేరువేరుగా సాగవచ్చును కదా ! ఇందు కింత రంపేల. భాషకు తాకట్టువస్తువులకువలె వాడుకొనఁగూడదనుకట్టుఁబాట్లు లేవుకదా? కవితాకళకు కొళాయినీటికున్నట్లు కొలఁతమీటర్లుండఁదగునా? శాంతినక్షత్రము సంసారికార్యమున కడ్డుదగులునట్లు శాస్త్రము కావ్యరమ్యతనడ్డుకొనఁగలదా ? విశాలహృదయులు, "నీవ్యాసం, యీజ్ వెరీ బ్యూటీఫుల్లు" (is very beautiful) అనుదు రనెడి మహాహోప్సుతో (hope) వ్రాసితిని. ఆపైని దయామయుని విష్సెట్లుండునో (wish).

ఇట్లు వ్రాయుటచే శైలీవిలాసినీశిరోజచిక్కుజంటల వివేకసువాసననూనెచే సంస్కరించి, సాపుసేయువ్యాపారమునకు నాభావము లెగేనెష్టులని యూహింపకుఁడు. నేనాసించునది కవితాకళాసువాసినీ కేశపాశశైలీమండనము కాని హోల్సేలుముండనము మాత్రము కాదని విన్నవించుచున్నాను.

బ్రహ్మవిద్యా.

అడయారు విద్యాలయప్రకటితము. (సంపు-1 సంచిక-1)

అడయారులోని దివ్యజ్ఞానసమాజమువారి గ్రంథాలయమునఁజాలవిలువగల యముద్రితగ్రంథములు గలవు. ఆగ్రంథములఁ బ్రకటించుట కాసమాజమువారీపత్రికను నెలకొల్పియున్నారు. ప్రథమసంచికయందు మాధవకృత మగు ఋగ్వేదభాష్యమును దేవస్వామిభాష్యసహితముగ నాశ్వలాయనగృహ్యసూత్రములును మొదలిడఁబడినవి. యోగోపనిషత్తు లాంగ్లభాషాంతరీకరణముతోఁ బ్రకటింపఁబడుచున్నవి. ఇవిగాక- అడయారువిద్యాలయ మెట్లు స్థాపింపఁబడినదో మొదట వివరింపఁబడినది. కల్కి యనుపదమును గూర్చి ఆటోశ్రేడరుగారిచే రచియింపఁబడిన విమర్శకవ్యాసమును దిఙ్నాగుని ప్రమాణసముచ్చయముపై లఘుటీకయుఁ గలవు. ప్రాచ్యవిజ్ఞానమును గూర్చి యిట్టి యమూల్యగ్రంథములఁ బ్రకటింపఁబూనిన దివ్యజ్ఞానసమాజమువారికి మనమందఱము కృతజ్ఞులమై యుండవలసియున్నది. ఈపత్రిక వార్షికమూల్యము రు 6/— సంవత్సరమునకు నాలుగుసంచికలు వెలువడును.

THE ADYAR LIBRARY BULLETIN Vol. I. Part I.

A very useful Bulletin called Brahma Vidya is now started under the auspices of the Theosophical Society, edited by Prof. C. Kunhan Raja M. A. D. Phil. (Oxon). Very many invaluable manuscripts have been collected by the society in the past and the society's attempt to bring forth this bulletin is an extremely laudable one. In the issue under review are commenced Madhava's commentary on Rgveda and Aswalayana's Grihya-sutras with the commentary of Devaswamin. An illuminating article from the pen of Prof. F. Otto Schrader attempts to give a derivaton of "Kalkin." We wish success to the publication of this journal and hope that all interested in Oriental Studies would encourage the same by becoming patrons and subscribers thereof. The Bulletin will be published in four parts per year and the annual subscription for the same is only Rs. 6.

వృషంబుకొమ్మల వ్రేలెడు జపమాలి
కలు హానులకు నిచ్చ్చకపులఁ గంటె
ఋవ్విచ్చు మునికుమారుల వేదపాఠంబు
లకుఁ దప్పు దిద్దుశారికలఁ గంటె
హోమవేళ లెఱుంగుచుఁ దామె వచ్చి
కుండ లటువెట్ట నిండఁ బాల్గురిసి మగిడి
పొలములకుఁ బోవు గోగణంబులను గంటె
యిందు మహిమంబు లేమన నిందువదన. ౧౪౧

వ. అని యయ్యాశ్రమంబు మహిమంబులు పొగడుచు నాచెంత నతి
కాంతంబును గుసుమితలతాక్రాంతంబును నగు నొక్క యేకాంతప
నాంతంబున నిలిచి ఋశ్యశృంగునిం గనుంగొందమనుచు నలుదిక్కు
లుఁ జూచుచుండ. ౧౪౨

క. ఆఋశ్యశృంగహానియు
మూరెఁడుగడ్డంబు నెత్తిమొలచినకొమ్ముం
జాలల మెకంబుతోలు వి
కారము దెలుపంగ నెదురుగాఁ గనిపించెన్. ౧౪3

వ. కనిపించిన నయ్యంగనలు మందహాసకందళితకపోల లగుచు నందఱుం
దమలోన. ౧౪౪

సీ. కొమ్మగో నడునెత్తిఁ గొమ్మొంది యాచుట్టు
జడలు చెంపల వ్రేలఁబడుట యొంది
మెడచుట్టుఁ జిల్లులచిడిపిరాల్గూర్చిన
తీరునఁ బూసలపేరు లేఁది
బుసి గప్పుకొన్నచొప్పున మేన నిండఁగ
మేదించినట్టి యాబూది యేఁది
కనవుముప్పిరిత్రాటఁ బొసఁగంగఁ గట్టిన
పొడచింకతోలు కచ్చడ మదేంది
నొసల మసిబొట్టి దేంది యొద్దెసల నిట్టి
బూచిఁ గనుఁగొన మమ్మక్క చూచినపుడె

వెఱపదరె యంచుఁ జేతొమ్ము చఱచికొనుచుఁ
గడఁగి దగ్గఱఁ జేరక కడనె యుండి. ౧౪౫

క. ఇమ్మానిసిమెకము న్నది
నమ్మ దగదు చేర గొబ్బునం జనకుఁడు పైఁ
గ్రమ్మి తల వంచికొని వడిఁ
గొమ్మున నటు చిమ్మినేని కొదవ వగుఁజుండీ. ౧౪౬

గీ. తరుణికో వీని శుద్ధదంతముల మీఁద
లీలఁ దాంబూలరస మింత గీలుకొనినఁ
బండి పగిలిన దాడిమీఫలములోని
విత్తు లన నుండు నెఱుఁగండు వీడియంబు. ౧౪౭

సీ. ఈపట్టవర్ధనం బేటికి నుదుటికిఁ
దీరుగాఁ గస్తూరి దిద్దరాదె
యీదర్భలపవిత్ర మేటికి వ్రేలికి
విడికెంపుటుంగరా లిడఁగరాదె
యీపొడచింకతో లేటికి మేనికి
వీణాము వలెవాటు వేయరాదె
యీతులసీభూష లేటికిఁ జెవులకుఁ
గట్టాణియొంటులు వెట్టరాదె
కొమ్ముమొలచినయంతనె కొదవ యేల
వచ్చు నితఁ డేమి చక్కనివాఁడు గాఁడె
యది కిరీటంబులోపల నణఁపరాదె
యంచుఁ బలికిరి మునిపుత్త్రుఁ గాంచి వేశ్య. ౧౪౮

గీ. ఘనుఁడె యితఁ డేమి యందఱకన్న వేఱె
కొమ్ము మొలచెనె యని యాడికొందు రేముఁ
గొమ్ము మొలచిన దితనికిఁ గొమ్మలార
మునిశిరోమణి యితఁడెపో ముజ్జగముల. ౧౪౯

గీ. చెలియరో వీఁడు నాచేతఁ జిక్కె నేని
కళలఁ జొక్కించి సుఖనిద్ర గ్రమ్మఁజేసి

గుఱుసు దగులకయుండంగఁ గొమ్ము దివిచి
మంచి కస్తూరిబరణి వట్టించవచ్చు. ౧౫౦

గీ. ఇతఁడు వనములలోఁ జరియించుకతన
నెత్తి వసి నాటినదొ లేక నిక్కముగను
గొమ్ము మొలచినదో యిటు కొమ్ములార
మునులలో నీవికారంబు గనము వినము. ౧౫౧

గీ. కొమ్మె కనిపించుఁగాని మెకమ్మునకును
బొమ్ముపైఁ బహు గడ్డంబు కోఁత లేదు
మెలఁతరో వీఁడు మానిసి మెకము చూడ
వీని నెలయింపవచ్చునే లోనుసేసి. ౧౫౨

సీ. తెలిగందవొడియు మంత్రించి మైనటు చల్లి
వెంటరా మరపెద వీనిఁ గొమ్ము
మొలనాలు దిగిచి కొమ్మున నుచ్చు దగిలించి
చేకట్టి కొని తెత్తుఁ జిగురుఁబోఁడి
గానంబుచేతఁ జొక్కఁగఁ జేసి యిట్టట్టుఁ
జనకుండఁ జేసెద వనజగంధి
ఫలములందునె మేఁత వలనొప్పఁగాఁ గూర్చి
భ్రమనొందఁ జేసెద భ్రమరవేణి
యనుచు నీరీతిఁ బాతంబు లాడికొనుచు
నొకట నందఱుఁ గస్తురిమెకములట్టు
లంగనలు మేలితావు లుప్పొంగుచుండఁ
జేరఁ జనుదెంచి యాఋశ్యశృంగుకడకు. ౧౫౩

సీ. ఒకకొమ్మె కనిపించుమెకము మానియటంచుఁ
బొదలలోఁ జని మోసపోయి పోయి
మానిఁ గాంచియుఁ జెట్టుమాటుకొమ్మెఱుఁగక
యితఁడు వేఁటకుఁ డంచు నెంచి యెంచి
యాటకై ఋషిపుత్రులతనివేషము పూని
తిరుగ వారలవెంటఁ దిరిగి తిరిగి

కని యొంటికొమ్ము మెకము మెకమ్ములలోన
మైఁ గాంచి కాదని మరలి మరలి
మాటికిని ముందుచూచినచోటె చూచి
కులుకుగుబ్బెత లోకరీతి గుఱుతుపట్టి
చేరి యీతండెపో ఋశ్యశృంగుఁ డనుచు
నలరి తమలోన నిట్లని తలఁచి రంత. ౧౫౮

సీ. వలలుగా మనకొప్పువలలు సల్లఁ దీర్చి
తగిలించుకొనవచ్చుఁ దరుణులార
గఁటలసరిపెణ గంటవేఁటలు వన్ని
కట్టుకొనఁగవచ్చుఁ బడఁతులార
వలకారి జిలుగుదువ్వలువలఁ దెరవారి
చిక్కించుకొనవచ్చుఁ జెలువలార
మేలనూలియురులు కొమ్మునఁ దగుల్పొనఁ జేసి
కొనిపోవఁగావచ్చు వనితలార
యిదియుఁ దానేల మనమూపు లెనయ వేఁట
యిట్టి వెనువెంటఁ జనుదెంచు నిట్టికరణి
వచ్చు మచ్చికవచ్చిక నిచ్చఁ దగిలి
మునిమృగము వేడుకలు మీఱ ముదితలార. ౧౫౯

వ. అని చేరం జనుదెంచిన వనితలం గనుంగొని ఋశ్యశృంగుండు.

సీ. అబ్బురంబుగ నెద గుబ్బకొమ్ములు మొల్చె
ఘనులు మీ కౌర నాకన్న ననుచుఁ
బదములఁ బొడమెనుఁ బద్మము లీవ్విరల
మహిమ యెంతటివింత మహినటంచు
ఘనములు వెనువెంటఁ గదియుచున్నవి జల
దాకర్షణము మీరి కబ్బె ననుచుఁ
బలుకుల నమృతంబు దొలఁకెడు బళి మీర
లమృతాంధసులకన్న నధికు లనుచుఁ

గా మెన్నఁడు నీసామగానగరిమఁ
కఠినపాషాణముల నీరుగాఁ గరంచె
నంచు మది నెంచి పలుమఱు నసుకుకుమఁ
గొమ్ముకొన యూఁగఁ దల యూఁచికొనుచుఁ జేరి. ౧౫౭

సీ. కులుకుగుబ్బెతలచూపులు గల్వవిరులంచు
దేవతార్చనకుఁ గాఁ దివియఁబూను
మగువ లందుకు నవ్వ నగవువెన్నెలలోన
విమలాంశుజల మంచు మునుఁగఁబోవు
వల దని కేల్సాఁచువారి పచ్చలకడి
యాలనిగ్గులు దర్భ లనుచు డాయు
నది గని తెప్ప వేయక చూచుకొమ్మల
ననిమిషు లని మ్రొక్కి నగ్గలించు
నపుడు తఱకొమ్మ కనువాఁకు నంచు నెంచి
వెనుకకై పోవ వారలఁ గనుచుఁ జేరి
యకట నాయెఁడ దయ లేదె యనుచుఁ బలుకు
నొక యిూతి సమ్ముగ్ధపాకాంక్షి. ౧౫౮

సీ. చెలువలు పన్నీరుచెంబు లిచ్చినఁ గాశి
కుప్పెలజల మంచుఁ గ్రోలనెంచు
సతులు జవ్వాది కొసఁగ గోపిచందన
మని ఫాలమునఁ దీర్చ నగ్గలించుఁ
గాంతలు మరువంపుఁగాను కిచ్చినఁ దుల
సీదళం బనుచు భక్షింపఁ జూచుఁ
బొలఁతులు వెలిగందవొడి యిచ్చిన విభూతి
యిది యటంచుఁ ద్రిపుండ్ర మిడఁ దలంచు
నలరుఁబోఁడులు వజ్రాలహార మొసఁగఁ
బటికపు జపాక్షసర మంచుఁ బాణిఁ బూని

మౌని జపియింపఁ దివురు నెం దైనఁ గలరు
ముగ్ధ లగువార లటువంటి ముగ్ధు గలఁడె. ౧౪౯

వ. తదనంతరంబ. ౧౫౦

ఉ. మ్రొక్కి కరాబ్జము ల్మోగిచి ముందఱ నిల్చి మునీంద్రులార మీ
రెక్కడనుండి వచ్చితిరి యిచ్చటి యాశ్రమభూమి లెన్నఁడుం
ద్రొక్కఁగఁ జూడ మిట్టిశుభరూపము గన్గొన నెమ్మనంబున
న్మిక్కిలి వేడ్కయయ్యె నని మెచ్చుచు వారలఁ జేరి యల్లనన్. ౧౫౧

సీ. హోమకుండికలెట్లు లెద మోదికొన్నార
లని కుచంబులు జేల నంటి యంటి
యీతెల్లరుద్రాక్ష లేవఁ గగ్గె నటంచు
హారము ల్పలుమాఱు నలమి యలమి
మంచివి కటిబద్ధమౌంజీగుణము లంచు
మొలనూళ్లు సారెకు ముట్టి ముట్టి
సూక్ష్మవల్కలము లెచ్చోటఁ దెచ్చితి రంచుఁ
బసిఁడంచుచేలలు పట్టి కట్టి
హోమరక్షలఁ బరిమళం బున్న దనుచు
మేలికస్తూరితిలకము ల్ఫాలసీమ
మోము దార్కొన మూర్కొని మునికుమారుఁ
డిట్లు భ్రమయుంగ నంగన లెల్లఁ జూచి. ౧౫౨

గీ. నేఁడు మనచేతఁ జిక్కెఁబో వీఁ డటంచుఁ
బాదములగెల్పుబిసుకులు వదిలముగను
గట్టుఁ డీఁక నంచుఁ జంకలు దట్టికొనుచు
నొండొరులఁ జూచి చిఱునవ్వు లుల్లసిల్ల. ౧౫౩

గీ. ఇంతచాలు నేఁటి కిటమీఁద మిక్కిలి
రేపునడిమె నేని రేపు రాఁడు
మచ్చు చల్లినట్లు మరిగి యిచ్చోటికి
వచ్చుఁ బోఁడు వీఁడు వనితలార. ౧౫౪

క. చండకరతేజుఁ డైన వి
భండకముని యెఱిఁగెనేని కటుకోపకళం
జెండకమానం డిచ్చో
నుండక యటు దొలఁగవలయు నో చెలులారా ! ౧౭౪

వ. అని యిట్లు మతకంబు లాడికొనుచు ఋశ్యశృంగుం గనుంగొని.

గీ. వ్రతము సలుపంగఁ బోవఁగావలయు మాకు
వేగ నీవును హోమాదివిధులు దీర్పఁ
బొమ్ము నేఁటికి మావనంబునకె మగిడి
యెల్లి వచ్చెద మిచటికి నో ఋషికుమార. ౧౭౫

క. అని ఋశ్యశృంగమునిఁ దన
వనమునకుం బోవనిచ్చి వారవధూటుల్
చని తా రుండిన మునుపటి
వనఁబొన్నలలోన నిలిచి నగవులు నిగుడన్. ౧౭౬

క. ఈసౌదామినుల సొంపులు
నీపువ్వుల తావికిని యే మనవచ్చున్
బాపురె యొక్కైన నమ్ముని
రేపిచటికిఁ దెచ్చి యుపచరింపఁగవలయున్. ౧౭౭

వ. అని యిట్లు కోరుకులు మీఱం బలుకుచు నప్పద్మనేత్ర లారాత్రి యవ్వనంబులో నిద్రించి మేలుకని మఱునాఁడు రేపకడయ సంధ్యాదికృత్యంబులు నిర్వర్తించి చనుదెంచిన మునికుమారుం గనుంగొని యొయ్యనొయ్యన నొయ్యారంబులు మెఱయ డగ్గఱ కరిగి యేమియు ననక కొంతతడవు నిలిచి రంత ఋశ్యశృంగుండును నయ్యంగనలం గనుంగొని కరంబులు మోడ్చి యోఋషులార మీరలు మాయాశ్రమంబునకు వచ్చి మాసేయు నుపచారంబులు గైకొనిపోవలయు నని ప్రార్థించి వారలం దోడ్కొని తనతపోవనంబునకుం జని యచ్చటం బర్ణశాలాంగణంబున రసాలసాలంబుల నీడ నందఱకు నందంబుగా దర్భాసనంబులు వైచి కూర్చుండ నియమించి నమస్కరించె. ౧౭౮

క. ఇదె యర్ఘ్యం బిదె పాద్యం
బిదె కుసుమఫలోపహార మిదె కొమ్మని స
మ్మద మొదవ ఋశ్యశృంగుఁడు
మదవతులకుఁ బూజ లొగి సమర్పణ సేసెన్. ౧౬౦

గీ. పూజ గైకొని వేడ్క నంభోజముఖులు
కంటిరే నేఁడు నిన్నటికంటె వెఱ్ఱి
మిగులఁ గనిపించె ననుచు లేనగవు లలర
నొయ్య డగ్గఱి కటుచేరి నెయ్య మొనర. ౧౬౧

సీ. కుందకందుకములచందానఁ జంద్రఖం
డములట్లు ఫేనషండములచాయఁ
పాండురచ్ఛాయలు పరిఢవిల్లుచునుండఁ
దెలిచక్కెరలను వెన్నలను గూర్చి
సొజ్జెలవగల మెచ్చులు పుట్టఁ జేసిన
కజ్జము ల్గొన్ని కైకొన్న లిచ్చి
మునినాథ మావనంబులపండు లివి కొన్ని
చవిచూడు మనినఁ గేల్సాఁచి యంది
త్రుంచి భక్షించుచున కొమ్ముతుద యొకింత
గదలఁ దలయూఁచి సంకులకరణి ధవళ
దంతములు గానుపింపంగ సంతసంబు
చెలఁగ మొగమెత్తి నవ్వుచుఁ జెలులఁ జూచి. ౧౬౨

క. ఇవి మీవనతరుఫలములె
చవి యే మనవచ్చు నమృతసంభవులో యీ
భువి నెన్నఁడుఁ గనుఁగొన మా
దివి నైనం గలవె యిట్టి తీయని ఫలముల్. ౧౬౩

గీ. ఎంతదూరంబు మీవన మిచటి కనిన
దూర మేడది గడియెఁడుత్రోవ యింతె
వనము గనుఁగొని పండ్లు దేవచ్చు నోడలు
గదలకుండంగఁ దోడుక పోయెదము నిన్ను. ౧౬౪

వ. అనిన విని ఋశ్యశృంగుం డంగనలం గనుంగొని. ౧౭౫

క. చనుదెంచెద నేనును మీ
వెనువెంటనె యనిన నవ్వి వికచాంబురుహా
నన లెల్ల నల్ల మలరఁగ
మనచేతికిఁ జిక్కె మునికుమారుం డనుచున్. ౧౭౬

సీ. తళుకుబంగరువ్రాఁత వలిపచేలలు వన్నె
నవతేరుపడఁ జాల హవణుమించఁ
గాసెలతీరుగాఁ గట్టి యాపై నల్ల
పట్టుదట్టులలీలఁ బరఁగ జడలు
నహిమలఁ జుట్టి యందముగాఁగ నందుపై
బలుకెంపుమొలనూళ్లు పరిఢవించి
అవికెలు ముడులు జాఱకయుండ బిగియించి
ముత్తేల జన్నిదంబులు ఘటించి
మేలి చందురుకావి రుమాలు లొక్క
వింతగా నాల్గుచుంగులు వెడలఁ గట్టి
రొమ్ముల నిండఁగఁ దెలిగంధపొడులు చల్లి
పల్లవాధర లెల్ల సంభ్రమము మెఱయ. ౧౭౭

సీ. తరలాక్షు లిద్దఱొండొరుల చేతులు గూర్చి
పొడవుగా నెత్తి యుగ్గడలఁ గొమ్ము
వగ హస్తములు సాఁచ వారివెన్నులఁ జన్నుఁ
గవహత్తి నిద్దఱంగనలు నిలిచి
దంతపుగొడెలచందానఁ గంకణకరం
బులు నిగిడింప వారలకు నడుమ
భామ లిద్దఱు నిల్చి పటముపోలికఁ గరా
బ్జాతంబు లుయ్యెలపట్టు గాఁగఁ
బట్టి యూచట్టు మునినాథుపస పొసంగఁ
గుడిభుజంబులక్రిందట జడలు దెచ్చి

రొయిఁడారుల రొండిఁ జెక్కి పసిండి సరిగ
చేల పన్నాగముగ వైచి లీల మెఱయ. ౧౭౮

క. అందలము రీతి నందఱు
నందంబుగఁ గూడికొనుచు నందు మునీంద్రుం
బొందుగ నిడికొని వదరక
మందగతుల మెఱయ హరిమార్గమునందన్. ౧౭౯

గీ. సాగి నడచిరి వికచాంబుజాతముఖులు
యోగివరు ఋశ్యశృంగుని నొకటఁ బొదివి
భోగిఁ జేపట్టుకొని పోవు బాగు మెఱయ
వేగిరమ యంగవిభునకు వేడ్క సేరు. ౧౮౦

గీ. బటువుబిగిగుబ్బబటువులపై నొకింత
యొఱగి యెరగింతయును లేక యొప్పుదండు
వనజనయనాభుజాందోళికను వసించి
తేజరిలె నప్పు డమ్మునిరాజు మిగుల. ౧౮౧

చ. వనజవిలోచన ల్మెఱుఁగువాలికచూపులు క్రేగ్లుదాఁట న
మ్మునిసుతు సారె గన్గొనుచు ముద్దులవేడుక చింక చిక్కెఁబో
యనుచు లసద్విలాసపరిహాసవచఃక్రమముల్ సెలంగఁగాఁ
జని రట సాగి యంగనృపచంద్రునిపట్టణపద్ధతిం దగన్. ౧౮౨

సీ. అడుగు జాఱకయుండ నడవుమీ యిచ్చోటఁ
బూఁదేనె జీరుకు పువ్వుఁబోఁడి
యెలమావి బలుకొమ్మ లిచట నడ్డము వచ్చె
నటపోయి తిరుగు మోయాంబుజాక్షి
కనుచూపు మేఱయ నిక్కడ రాజనపువంక
యిరుమేల కొయిద్దిక సరసిజాక్షి
సంగడఁబులు గూడి చనుఁ డిందుముఖులార
కెందమ్మికోలఁకుల నందుత్రోవ
కలిగెఁ జిన్నారిమోపు బంగారుమోపు
బాపురే యంచు మేలంపుఁ బలుకు లలర

నొండొరుల నెచ్చరించుచు నింపు వేడ్కఁ
గూడి నడచిరి మునిపుత్రుఁ దోడికొనుచు. ౧౪౩

క. కైలాగు తడుగు దిగుడల
మే లుప్పర మింకు జతన మే ల్బళి యనుచు
న్నేలము లాకుచుఁ జని ర
బ్బాలామణు లంగవిభునిపట్టణమునకున్. ౧౪౪

వ. ఇత్తెఱంగున వారాంగనలు ఋశ్యశృంగమునిపుంగవుం దోడ్కొని యంగరాజరాజధానిం బ్రవేశించి తక్షణంబ జనులెల్ల నీక్షించుచుండ నద్భుతంబుగ. ౧౪౫

సీ. చిమ్మచీఁకటులు హెచ్చిలఁ గాఱుక్రమ్ముదు
మేఘంబు లొయ్యన మిన్నువ్రాఁకె
మేఘజాలమునందు మిహిపైఁడితీఁగల
కరణిఁ గ్రాలమెఱుంగుగములు మెఱసె
మెఱపులతోడనె తిఱుదుగా నుఱుములు
ఘుమఘుమధ్వనుల దిక్కులఁ జెలంగె
నుఱుములతోఁ గూడ నొకట ధారాళమై
వాన ధారుణిఁ జలువానఁ గురిసె
దేవదుందుభినాదంబు దివ్యపుష్ప
వృష్టియుఁ బొసంగ జగము సంతుష్టి నొంద
ఋశ్యశృంగమునీంద్రుఁ డింపెసక మెసఁగ
నంగవిభుపట్టణము చేరినంతలోన. ౧౪౬

క. నిండుమదితోడఁ గూడి వి
భండకతనయుండు రోమపాదునిపురిలో
రెండకుగు లిడినమాత్రన
కుండలు గొని వంచినట్లు గురిసెఁ ఘనముల్. ౧౪౭

సీ. అంగరాజును ఋశ్యశృంగుని కెదురేఁగి
భయభక్తివినయసంభ్రమము లలర

సాష్టాంగ మెఱఁగి యర్ఘ్యముఁ బాద్యము నొసంగి
తననగరికిఁ దోడుకొనుచు వచ్చి
యంతఃపురంబున హైమపీఠిక నుంచి
పుష్పాక్షతంబులఁ బూజచేసి
మనసునఁ గోరుంబు గనకుండునట్లుగా
నమ్మహాత్ముని ప్రసాదమ్ము గాంచి
శుభముహూర్తంబునందును విభవమెసఁగఁ
దనకుమారిక శాంత నమ్మునికి నొసఁగె
శాంతయును దాను నిప్పు డాసంయమీంద్రుఁ
డంగవిభునింట నున్నాఁడు హర్షమెసఁగ. ౧౫౮

వ. అని యివ్విధంబున దశరథమహీనవునకు సుమంత్రుండు ఋశ్యశృంగునికథ సవిస్తరంబుగా వినిపించెఁ దదనంతరకథాసంవిధానం బెట్టి దనిన. ౧౫౯

శా. ప్రస్తీతప్రకటప్రతాపతపనప్రౌఢోష్మశుష్యన్నిశా
టస్తోమోచ్ఛలబాహుజవ్రజప్రచండస్థాణుకోదండవి
ధ్వస్తిధ్వానఘనానకస్వనసముద్దామక్షమాకన్యకా
హస్తైకృత్యభివర్ధితోదయ దయోదంచద్దృగంభోరుహా. ౧౬౦

క. కర్కశకలహాసముద్భట
మర్కటభటబంధితాబ్ధిమధ్యశిఖశుభో
దర్కకరదివ్యగుణగణ
యర్కకులాభరణ ఘననిజాంగస్ఫురణా. ౧౬౧

పంచచామరము:—
సురస్ఫురత్కిరీటకోటిశోభితాంఘ్రిపంకజా
శరాసభృత్కరా శరాగ్రజర్జరీకృతాశరా
మరుత్సరిచ్ఛరఘ్నసస్మరద్విషత్సితచ్ఛద
స్వరీశ్వరద్విపచ్ఛవిచ్ఛటానటద్యశోఘనా. ౧౬౨

గద్యము. ఇది శ్రీరామచంద్ర సాంద్రకరుణాకటాక్షలబ్ధ సిద్ధసారస్వతవిశేషనిరర్గళవాగ్వైభవాశేష సరససాహిత్య కళాభోజ, సత్యసంభూషితముఖాంభోజ, సకలసామ్రాజ్యధారేయ, నిత్యవితీర్ణిధారారాధేయ, నిరతావారితాన్నసత్త్రసంతోషితపంచాశత్సహస్రభూసుర, బహువారావర్తితమహాదానవైభవాసక్తితకీర్తిభాసుర, నిజనామాంకితాకలంకవస్తుసమగ్రబహుళాగ్రహారభూషితచోళధరామండల, నిఖిలభోగవిభవనిర్జితాఖండల, సాధితసముద్రాంతరద్వీప పరనృపాలసంస్తుతప్రతాప, నేపాలభూపాలస్థాపనాచార్య, కర్ణాటరాజపూజనీయ ధౌరంధర్య, రామసేతు శ్రీరంగ విజయరాఘవపుర కుంభఘోణాది దివ్యస్థలప్రతిష్ఠాపిత రామభద్ర, సర్వజనసంభావిత గాంభీర్యముద్రానిర్జితసముద్ర, సదాశ్రితభరణదీక్షాదక్ష, దక్షిణసింహాసనాధ్యక్ష, రాజాధిరాజసన్నుతాసాధారణశౌర్య, దిగంతప్రసిద్ధతరౌదార్య, సుజ్ఞానజనక, సతతసంసేవితజనక, పోషితవిద్వత్కవియూథ, భువనశోభితగుణసనాథ, బలవత్పరిపంథిగృహీత సామంతమహీకాంతవిమోచనశ్లాఘనీయ బాహుబల, మూర్తిమాంబాగర్భశుక్తిముక్తాఫల, చినచెవ్వయాచ్యుతనృపాలపుత్త్ర, సజ్జనస్తోత్రపాత్ర, రూపరేఖావిజితసుమసాయక, సకలధర్మసంధాయక రఘునాథనాయకప్రణీతం బైనశ్రీమద్రామాయణంబున విబుధజనవినుతవివిధకథాశాఖాప్రకాండంబగు బాలకాండంబునందు ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు.

రఘునాథరామాయణము.

తృతీయాశ్వాసము.

క. శ్రీకౌసల్యానందన
కాకుత్స్థకులాబ్ధిచంద్ర కరుణాసాంద్రా
లోక మునిలోకహృదయవ
శీకరణగుణాభిరామ శ్రీరఘురామా. ౧

వ. అవధరింపు మట్లు సుమంత్రుండు ఋశ్యశృంగునికథ చెప్పి మఱియు
నద్దశరథమహీధవునితో నిట్లనియె. ౨

సీ. నరనాథ వినుము సనత్కుమారుండు వెండి
యీకథాశేషమునంద యిట్లు లనియె
నిక్ష్వాకుకులమున నిద్ధచారిత్రుండు
దశరథుం డన మహీధవుండు పుట్టు
శాంత యన్నన్యక జనియించు నతనికి
నంగాధిపతితోడ బొసంగు చెలిమి
యంగాధిపతికడ కతం డేగి ధరణీశ
నాకు నిప్పటికి నందనులు లేమ
ఋశ్యశృంగుని బనుపు మాఋషివరుండు
గడంగి పుత్రేష్టి గావింపం గలరు సుతులు
ననుం గృతార్థునిం జేయు మెంతయును గరుణ
ననుచుం బ్రియ మొప్పంగాం బల్కు వినయమొనయ. 3

వ. అనిన నంగరాజు రోమపాదుండును దనయల్లుం డగు ఋశ్యశృంగ
మునిపుంగవు శాంతతోడంగూడ నమ్మహీధవుని వెంట నంపు ఋశ్య
శృంగుండును బుత్రకామేష్టి సేయించు నతని మంత్రమహిమంబున
నద్దశరథమహీధవునకు నలుగురు కుమారులు గలుగుదు రని సనత్కు

వారుండు తొల్లి ఋషులసన్నిధిం బలికె నిది నిస్సంశయం బోమ
హీపాల నీవ సకలబలసన్నాహంబు చెలంగ నంగరాజు దగ్గఱి కరిగి
ఋశ్యశృంగు నడిగి తోడ్కొని రమ్మనిన విని సుమంత్రుని వచనం
బున కలరి యమ్మహీకాంతుండు సంతసంబున నంతయుం దనగురుం
డగు వసిష్ఠమహర్షి వరునకు విన్నవించి యతని యనుమతి వడసి శుభ
ముహూర్తంబున నంతఃపురకాంతలతోడం గూడం గదలవలయు నని
నిశ్చయించి మంత్రిసామంతుల కెల్లం బయనంబు చెప్పించి తానుం
బ్రయాణోచితవేషభూషితుండగుచు హెగ్గళ్ళ బిలిచి పల్లకులు గద
లింపుఁ డని నియోగించిన. ౪

శా. సాగెం బల్లకు లంత నాదశరథక్ష్మాపాలునాజ్ఞప్తి ము
క్తాగుచ్ఛస్ఫురదచ్ఛశోభ లెసఁగంగా జీని బంగారు మే
ల్తీఁగ ల్గ్రాచ్చిన జాలకంబు లొఱపో దిండ్లొప్ప హొంబట్టుప
న్నాగంబు ల్తమిఁ జూచుచూపఱకు నానందంబు సంధింపఁగన్. ౫

గీ. కొన్నిపల్లకు లొట్టెఁ గూడి నడచెఁ
బద్ధములవ్రాఁత యపరంజిపంజరముల
నిగుడు జిగి యందులో నున్ననృపవధూమ
ణులకు నందంద చీఁకటు ల్దలఁగఁ జేయ. ౬

క. కొమ్ముల బంగరుటనుసులు
ముమ్మరముగ నెండ గాయు ముత్తెపుఁ బన్నా
గమ్ములు వెన్నెల గాయఁగఁ
గొమ్మలపల్లకులు కొన్ని గూడఁగ నడచెన్. ౭

సీ. ప్రోల భూసురయుగ్మములు గూడి సుస్వరం
బులు గూర్చి యష్టకంబులు చదువఁగఁ
బసిఁడి యుంగరముల బారుకోలలు పూని
గొల్లలు సందడి యెల్లఁ దలఁగ
బంగారు పెట్టెలు పరికించుకొనుచు హె
గ్గళ్లు తేజీలపైఁ గడలఁ జనఁగ

బట్టుఁదిష్ఠులకనై ల్వట్టి నెన్నడలచే
నడిగంపుఁ జేడియల్ గెడలరాఁగ
నడచె దశరథవసుమతీనాథమౌళి
యగ్రమహిషుల కనకపల్యంకిక లట
మెఱుఁగుఁదీఁగలలోపల మెఱయుచుండఁ
గమిచి ధరఁ జాగు చిత్రమేఘములలీల. ౮

గీ. పసిఁడిపల్లంపుజోకలఁ బరిఢవిల్లు
గోడిగలమీఁద ముసుఁగులు గొన్ని కదలెఁ
బల్లకులఁ గూడి పెదముసనళ్లు గొంద
ఱిరుగడలయందుఁ దగ బరాబరులు సేయ. ౯

క. చని రటు మాత్రులు నందఱు
వెనుకం దేజీల నెక్కి వినయము భయముం
గనిపింప నాత్మవర్తన
వినుతి గనం జేయు శుద్ధవేషము లలరన్. ౧౦

సీ. కటగళన్మదములు కాల్వలై ప్రవహింప
సామజఘటలు పార్శ్వములఁ జెలఁగఁ
గనకకింకిణికానికాయంబు మొరయంగ
రథసమూహములు సారథులు నడుప
ఖురఘాతధూళి దిక్కులఁ గ్రమ్మ నొక్కట
ఘోట్టాణహయములు గూడినడువ
నాయుధద్యుతులు మిన్నులమ నుద్భటవీర
భటనికాయంబులు బలసి కొలువ
వివిధవాద్యనినాదంబు దివియు భువియుఁ
జెఱచి మ్రోయంగ బిరుదధ్వజములు మ్రోలఁ
బరిఢవిల్లఁగ నంత నప్పంక్తిరథుఁడు
గదలె శిబికాధిరూఢుఁడై ముదము వొదల. ౧౧

సరగల్ "హంసమాలిక"-స ।।U, ర U।U, గ U;
"కుమారలలితా"జ్సగల్-జ ।U।, స ।।U, గ U;
యయల్గంబు "లోలాఖ్యక"-య ।UU, య ।UU, గ U;
ఔ "సరసిజ"భస్గల్-భ U।।, స ।।U, గ U.

క. ఎనిమిదవ యా'యనుష్టు'
ప్పున ఋతుశరనయన*వృత్తములఁ దగుఁ బన్ద్రెం
డును విద్యున్మాలాకులు
ఘనకృతులను జాల మీఱితి కాయజవైరీ. ౯

వ. మాగా "విద్యున్మాలా"రీతుల్-మ UUU, మ UUU, గU, గU;
భాగగ "చిత్రపదా"ఖ్యన్-భ U।।, భ U।।, గ U, గ U;
"మాణవకం"బౌ భతవల్-భ U।।, త UU।, వ ।U;
మ్నాగాల్"హంసరుత"మయ్యెక-మ UUU, న ।।।, గా U U;
ఔ"సమానిక"రజవల్-ర U।U, జ ।U।, వ ।U;
"ప్రమాణిక" జరల్లగల్-జ ।U।, ర U।U, లగ ।U;
"నారాచిక" తరల్లగల్-త UU।, ర U।U, లగ ।U;
"నాగరక" భరల్లగల్.భ U।।, ర U।U।, లగ ।U;
జతల్గగంబు"విద్మానన్"-జ ।U।, త UU।, గగ UU;
(వితాన మా దీనిపేరే) జ్మగా"విత్మాన" మ్మా నెంచుక-జ ।U।,
మ UUU, గా UU;
"సింహరేఖ" రజగంబుల్-ర U।U, జ ।U।, గగ UU.

క. ఆనవసంఖ్య 'బృహతిఁ' గల
యేనూఱును బదియు రెండు వృత్తంబులయం
దేనగుహాలముఖి మొద లగు
వానిని వచియింతు వినుము వాయుకుమారా. ౧౦

వ. ఔ రనల్సము "హాలముఖిన్"-ర U।U, న ।।।, స ।।U;
"భుజగశశిరుత"న్నామల్-న ।।।, న ।।।, మ UUU;

* ౨౫౬. (ఋతుశరనయన)

భారల "నుత్సుక" పరాఁ గృతిఁ-భ U||, భ U||, ర U|U;
"భద్రకంబు" రనరంబులన్-ర U|U, న |||, ర U|U.

క. పది యగు 'పంక్తి' వెయియిన్నిఱు
పదినాలుగువృత్తములను వహిఁ కెక్కుచు గా
ముదిమాదిగఁ బాడ్రెఁ డవి
కదనక్షితివిదళితాక్ష కపికులదక్షా. ౨౧

౧౦. నతతగల్బొప్ప-న్పసఁ "గౌముదిన్"-న |||, త UU|, త UU|, గ U;
ప్రాఁకు "నృ్దవి-రాటి" మస్జగల్-మ UUU, స ||U, జ |U|, గ U;
మ్నౌ్య్ల గం బుంచఁ "బ్ర-ణ"వ మై యుండున్-మ UUU, న |||, య |UU, గ U;
"రుగ్మవతిం" జే-ర్చున్ భ్మసగంబుల్-భ U||, మ UUU, స ||U, గ U;
చాలున్ "మత్తన్" మభసలు గంబున్-మ UUU, భ U||, స ||U, గ U; దీనిపేరే హంసశ్రేణి.
నరజగ లగు-"మనోరమన్"-న |||, ర U|U, జ |U|, గ U;
రజ్రజగ "ల్మయూ-రసారి" శోభిల్లున్-ర U|U, జ |U|, ర U|U, గ U; దీనిపేరే మయూరభాషిణి.
చాలనర్గమము-"నారి" యందున్-ర U|U, న |||, ర U|U, గ U;
భమ్నలు గంబున్ "చంపకమాలిన్"-భ U||, మ UUU, స ||U, గ U;
ఓరసాగల-నా "మణిరంగన్"-ర U|U, స ||U, స ||U, గ U;
భత్జగముల్ ప్రా-పగునందికిన్"-భ U||, త UU|, జ |U|, గ U;
"పంక్తి"కి మద్యతి-భాభగలా-భ U||, భ U||, భ U||, గ U;
"వీరవిలసితో-ర్వి" భన్నల్ జగల్-భ U||, స ||U, జ |U|, గ U.

క. పదునొకఁ డగు 'త్రిష్టుప్పునఁ'
బదపడి ద్విసహస్రసంఖ్యపై నలువదిరెు

స్మిడలోన నింద్రవజ్రము
మొదలుగ నిర్వది మెసంగు మునినుతచరితా. ౮౨

౧౧. ఇత్తాజగాలై తగు-"నింద్రవజ్రన్"-త U U |, త U U |, జ | U |,
గా U U;

కృతిన్"జతజల్గ"ను-పేంద్రవజ్రన్"-జ | U |, త U U |, జ | U |,
గా U U;

ఈవజ్రముల్ రెంటను-నిట్లు కూర్పన్
సవజ్రదేహా "యుప-జాతి" యయ్యెన్.

తజాల"సుకసిత"-దా౯ జెలంగున్-త U U |, జ | U |, జ | U |,
గా U U;

"తోదక"భాభల-తోగగమొందున్-భ U | |, భ U | |, భ U | |,
గగ U U;

ఆ రనల్రవము-లో"రథోద్ధతన్" ర U | U, న | | |, ర U | U, వ | U;
దీనిపేరే పరాంతికము.

ననరవలు పెనంగు"భద్రికన్"-న | | |, న | | |, ర U | U, వ | U;

"స్వాగత"౯ రనభ-సంగగగంబుల్-ర U | U, న | | |, భ U | |,
గగ U U;

"శాంతికి౯" తజజల్వము-గల్గి తగుగ౯-త U U |, జ | U |, జ | U |,
వ | U;

కేశవాథ"సేని-కి౯" రజల్రవల్-ర U | U, జ | U |, ర U | U, వ | U;

ఔ "వాతోర్మి౯" మభ-తాన్వితవముల్-మ U U U, భ U | |,
త U U |, వ | U;

ఔ నా "కలికాంత" త-జావ లిడ౯-త U U |, జ | U |, జ | U |,
వ | U; దీనిపేరే గీతాలంబనము.

"శాలిన్యా"ఖ్య౯ మించు-జాలె స్మతాగాల్-మ U U U, త U U |,
త U U |, గా U U;

తోదకవృత్తమునకు అప్పకవీయమున దోదకమని యున్నది. పేరికి శ్యేని యని యున్నది

నజజలగల్ దనరు "నృపముఖర్"-న।।।, జ।U।, జ।U।, లగ।U;

మభ్నల్వంబుల్ "భ్రమరవిలసిత"-మUUU, భU।।, న।।।, వ।U;

ననతగగముల్-నలో"వను "వృత్త"-న।।।, న।।U, తUU।, గగUU;

నయమగః "బృథివి"-వాజవల్ల-న।।।, న।।।, జ।U।, వ।U;

ననసగగ లెనయు-నా"వృత్త"-న।।।, న।।।, స।।U, గగUU;

"మౌక్తికమాలా"శ్రి-మముభత్నల్ గాన్-భU।।, తUU।, న।।।, గాUU;

"ఉపస్థితము" చే-యుల్ జస్తగాప్తి-జ।U।, స।।U, తUU।, గాUU;

"శిఖండివిరుతుల్"-జెల్ జస్తగాల్ల జ।U।, స।।U, తUU।, గాUU;ఇదే శ్రీయనువృత్తము-

ఈమభ్జల్ గద్వయము-"నేకరూపక"-మ UUU, భU।।, జ।U।, గా UU.

క. 'జగతి' ఛందంబునఁ బొం
దుగఁ గల్గిన నాల్గువేలుఁ దొంబది యును నా
ఱగు వృత్తంబుల నిరువది
దగు స్రగ్విణి యాదిగాఁగఁ దరుచరపీరా. ౮3

౧౨. మధ్యతిర్ రారరల్-"స్రగ్విణీ"వృత్తమా-ర U।U, ర U।U, ర U।U, ర U।U;

యయాయల్"భుజంగప్రయాతా"వడేళ్ల-య।UU, య।UU, య।UU, య।UU;

తుదిదాఁక ససాసలఁ-"దోటక"మా-స।।U, స।।U, స।।U, స।।U;

మంబుల్ భ స్మల్ "జలధరమాలా"రీతుల్-మ UUU, భ U।।, స।।U, మ UUU;

ఉపస్థితము, శిఖండివిరుతము రెండు నొక్కటియే. ఇదియే శ్రీవృత్తమును. అప్పకవీయములో శ్రీవృత్తమనికలదు.

ఆంధ్రసాహిత్యపరిషత్తు—ప్రతిష్ఠాపకులు.

శ్రీరాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు, పిఠాపురముమహా రాజావారు; పరిషచ్ఛాశ్వతాధ్యక్షులు.

కీ. శే. శ్రీ వేంకటగిరి మహారాజావారు.

కీ. శే. శ్రీ బొబ్బిలిమహారాజావారు.

ఉద్ధారకులు.

శ్రీరాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు-ఉయ్యూరు జమీందారువారు.

ఆంధ్రసాహిత్యపరిషత్కార్యనిర్వాహకసభావర్గము.

కార్యనిర్వాహకసభాధ్యక్షులు.

జయంతి రామయ్యపంతులుగారు, బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

కిడాంబి రాఘవాచార్యులుగారు ఎం. ఏ., బి. ఎల్.

వింజమూరి వెంకన్నపంతులుగారు ఎం. ఏ.

—కార్యనిర్వాహకసభాసభ్యులు.—

దివాన్ బహద్దర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తినాయఁడుగారు, (కోశాధ్యక్షులు)

పెద్దాడ రామస్వామిగారు, ఎం. ఏ. ”

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు.

కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు.

శ్రీమాన్ గోదవర్తి జగన్నాథస్వామిగారు, ఎం. ఏ., ఎల్. టి.

దర్భా వేంకటశివరామరాజుగారు, బి. ఏ., బి. యల్.

అకెళ్ల వేంకట్రామయ్యగారు.

కేశవరపు కామరాజుగారు.

కోటా వేంకటసుబ్బారావునాయఁడుగారు.

ఓలేటి వేంకటరామశాస్త్రిగారు, శతావధాని.

పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారు.

పిల్లారిసెట్టి కం. బ్రహ్మారావునాయఁడుగారు.

శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు.

శ్రీ పిఠాపురము మహారాజావారి ధనసహాయముచే రచియింపఁబడుచున్న పెద్దనిఘంటువులోని, రాయల్ సైజు 1000 పుటలుగల ప్రథమసంపుటము ముద్రితమై విక్రయమునకు సిద్ధముగా నున్నది. ఇందు, అకారము మొదలు, ఔకారమువఱకును గల యచ్చు లాదియందుఁ గల సంస్కృతాంధ్రశబ్దము లన్నియుఁ గలవు. ఇదివఱకున్న నిఘంటువు లన్నింటికంటె నిది సర్వవిధముల నుత్తమమైనది. ఈ భాగము శబ్దరత్నాకరములో 186 పుటలలో నిమిడినది. దీనినిబట్టి యీరెంటి నిఘంటువులకుఁ గల తారతమ్య మూహింపవచ్చును. ఈనిఘంటువునందు, సంస్కృతశబ్దములు పూర్వనిఘంటువు లన్నింటియందుకంటె మిక్కిలి యధికముగా నీయఁబడినవి. కావున సంస్కృతవిద్యార్థులకుఁ గూడ మిగుల నుపయోగకరముగా నుండును. ఇది యున్నచో సంస్కృతనిఘంటువు నపేక్ష యుండదు. అచ్చికపదములకుఁ గల యర్థభేదములఁ గనఁబఱచి వానికిఁ బ్రమాణవాక్యములను బూర్వగ్రంథములనుండి విపులముగా నీయఁబడినవి. లభ్యమైనంతవఱకుఁ దెనుఁగుశబ్దములకు సంస్కృతద్రావిడాదిభాషలయందుఁ గల సజాతీయపదములు చూపఁబడినవి. కేవలము విడిశబ్దములే కాక సందర్భానుసారముగ సమస్తపదములు (Phrases) ను దానికిఁ గలయర్థములును బ్రయోగములును గూడ నీయఁబడినవి. జనకశబ్దములక్రింద జన్యశబ్దములు చూపఁబడినవి. ఏవిధముగఁ జూచిన నిది యిదివఱకున్న నిఘంటువు లన్నింటికంటె మిన్నయని మఱియొకసారి నిస్సంశయముగఁ జెప్పవచ్చును. దళసరికాగితములమీఁద నచ్చువేయఁబడినది. చక్కనియక్షరములు, తోలు, క్యాలికోలతో గట్టి బైండుచేయఁ బడినది. గిల్టు అక్షరములతోఁ బేరు గలదు. పుస్తకభాండాగారముల కిది యలంకారముగ నుండును. విద్యార్థులకు సహకారి. ఈపుస్తకమును రచియించుటకు ముద్రించుటకు విశేషద్రవ్యము పట్టినను ధనవంతులకే గాక జనసామాన్యమునకుఁ గూడ లభ్యముగా నుండవలయునను తలంపుతో సాదాప్రతి వెల రు. 5 లు, ఆర్టుపేపరు ప్రతి రు. 7 లు, మాత్రమే నిర్ణయింపఁబడినది. రైలు, పోస్టువ్యయములు, కొనువారే భరింపవలయును. కావలసినవారు, కాకినాడ, ఆంధ్రసాహిత్యపరిషత్తు కార్యదర్శులకు వ్రాయఁగోరెదను.

Printed by N. Achutaramiah at the Cocanada Printing Works, Cocanada